ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత సోమవారం గరిష్ఠం : 31.0 కనిష్ఠం : 24.0
ANDHRAJYOTHY



కిక్కిరిసిన బత్తలపల్లి నాలుగు రోడ్ల కూడలి

ఖాసీం స్వామి నామస్మరణతో మార్మోగిన బత్తలపల్లి
వైభవంగా పీర్ల భేటీ... కిక్కిరిసిన నాలుగు రోడ్ల కూడలి



భేటీ అయిన పీర్లు



అనంతపురం జిల్లా గూగూడులో అగ్నిగుండం దాటుతున్న పీరు

ఉప్పొంగిన భక్తజనసంద్రం

బత్తలపల్లి, జూలై 7(ఆంధ్రజ్యోతి) ఖాసీం స్వామి నామస్మరణతో బత్తలపల్లి మార్మోగింది. నాలుగురోడ్ల కూడలి భక్తజనసంద్రంగా మారిపోయింది. ఖాసీం స్వామి భేటీని తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఉమ్మడి జిల్లాలో గూగూడు తర్వాత అంత స్థాయిలో బత్తలపల్లి మొహర్రం ప్రసిద్ధి. చివరిరోజైన బుధవారం ఖాసీంస్వామి భేటీ కార్యక్రమం నిర్వహించారు. స్వామిని వివిధ రకాలు పుష్పాలు, వెండి ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం స్వామి.. భక్తులకు దర్శనమిస్తూ నాలుగురోడ్ల కూడలికి చేరుకున్నారు. మండలంలోని గంటాపురం, వేల్పుమడుగు, పోట్లమర్రి, రాఘవంపల్లి, ముష్టూరుకు చెందిన పీర్లు అక్కడికి చేరుకుని ఖాసీం స్వామితో సలామ్ (భేటీ) తీసుకున్నాయి. కార్యక్రమం సాగుతున్నంత సేపు నాలుగురోడ్ల కూడలి ఖాసీం స్వామి నామస్మరణతో మార్మోగింది. భేటీ తీసుకున్నపుడు భక్తులు బెల్లం వంటల వర్షం కురిపించారు. ఇలా భేటీ తీసుకోవడం ద్వారా కుల మతాలకు అతీతంగా అన్ని గ్రామాల ప్రజలు సోదరభావంతో కలిసిమెలసి ఉంటారని భక్తుల నమ్మకం. భేటీ తర్వాత పీర్ల మకాన్ వద్దకు వెళ్లి చదివింపులు చేసుకుని, పీర్లు తిరిగి ఆయా గ్రామాలకు వెళ్లాయి. సాయంత్రం ఖాసీంస్వామి జలధికి తరలి వెళ్లారు. మండలంలోని వెంకటగారిపల్లి వద్ద మాల్యవంతం, అనంతసాగరం, వెంకటగారిపల్లి, నార్శింపల్లి పీర్లు భేటీ తీసుకున్నాయి.

ఉత్సాహంగా అలావ్...!

ఖాసీం స్వామి, పీర్లు జలధికి వెళ్లే మకాన్ వద్దకు వచ్చిన భక్తులు అలావ్ తొక్కుతూ సందడి చేశారు. చిన్న, పెద్ద, మహిళలు, వృద్ధులు తేడాలేకుండా గుండం చుట్టూ, నాలుగురోడ్ల కూడలి వద్ద తప్పెట్ల తాళాలకు ఉత్సాహంగా అలావ్ తొక్కారు. అనంతపురం జిల్లా గూగూడులో సోమవారం పీర్ల అగ్నిగుండ ప్రవేశం, జలధి నిర్వహించారు.

మేళా.. మేలా..?

- రూ.కోట్ల విలువైన ఫోన్ల రికవరీ
- నెలల తరబడి ఇవ్వకుండా డీపీఓలో నిల్వ
- వేలల్లో పోగయ్యాక.. డిస్ట్రిబ్యూషన్ మేళా..!
- దిక్కులేక.. కొత్త ఫోన్‌లు కొంటున్న బాధితులు
- మూడేళ్లలో 12,594 ఫోన్‌లను రికవరీ చేసిన పోలీసులు



ఈ ఫొటో చూడండి..! ఉద్యోగుల బదిలీ కౌన్సెలింగ్ అయ్యుంటుంది అనుకుంటున్నారా..? కాదు, యువకులు కనిపిస్తున్నారు.. జాబ్‌మేళా అయ్యుంటుంది అనుకుంటున్నారా..? అవేమీ కాదు..! ఉమ్మడి జిల్లాలో సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్నవారు వీరంతా..! పోలీసులు వాటిని రికవరీ చేసి, జూన్ 27న అనంతపురం పోలీస్ పరేడ్ మైదానంలో బాధితులకు ఇచ్చేశారు. ఒకేసారి రూ.3.03 కోట్ల విలువైన 1,216 సెల్‌ఫోన్‌ల పంపిణీ చేశారు. చాలా గొప్ప విషయం కదా..? పోలీసుల చొరవను అభినందించాల్సిందే..! ఎందుకంటే.. ఒకప్పుడు బైక్‌పోతేనే కేసు కట్టేవారు కాదు. అలాంటిది సెల్‌ఫోన్ గురించి ఎవరు పట్టించుకుంటారు..? అందుకే.. ఫోన్ పోతే.. తమ ఖర్మ అనుకుని వదిలేసేవారు. ఇప్పుడు అలా కాదు..! పోలీసులకు ఫిర్యాదు చేస్తే.. పోయిన ఫోన్ దొరుకుతుందనే భరోసా వచ్చింది. గడిచిన మూడేళ్లలో ఏకంగా 12,594 ఫోన్లను జిల్లా పోలీసులు రికవరీ చేసి ఇవ్వడం దీనికి నిదర్శనం. ఇది పైకి కనిపించే కోణం..! దీని వెనుక మరో కోణం ఉంది. పోయిన ఫోన్ దొరికినా.. బాధితుల కళ్లలో ఆనందం కనిపించడం లేదు.

ఏం ప్రయోజనం..?

అదేమిటీ..? పోయింది అనుకున్న ఫోన్ దొరికినా (మిగతా 6లో...)

అర్జీలకు మెరుగైన పరిష్కారం: జేసీ



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ అభిషేక్‌కుమార్

పుట్టపర్తి టౌన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి వచ్చి అర్జీలు సమర్పించిన ప్రజలు సంతృప్తి పడేలా మెరుగైన పరిష్కారం చూపించాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్.. అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో జేసీ పాల్గొని, 172 అర్జీలను స్వీకరించారు. జేసీ మాట్లాడుతూ.. ప్రజల ఫిర్యాదులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, సకాలంలో పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో విజయసారథి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సూర్యనారాయణరెడ్డి, రామసుబ్బయ్య, పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ, డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య పాల్గొన్నారు.

జవాను భూమి కబ్జా

తన పట్టా భూమిని కొంతమంది రాజకీయ నాయకులు కబ్జా చేశారని ధర్మవరం మండలంలోని బడన్నపల్లికి చెందిన సీఆర్‌పీఎఫ్ జవాను చెన్నారెడ్డి ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో జేసీకి అర్జీ ఇచ్చారు. జవాను మాట్లాడుతూ.. కనగానపల్లి మండలం దాదులూరు పొలంలో తనకు పూర్వీకుల నుంచి సంక్రమించిన 5.16 ఎకరాల భూమి ఉందన్నారు. తాను జమ్ముకాశ్మీర్‌లో విధులు నిర్వహిస్తుండగా కొంత మంది రాజకీయ నాయకులు తన భూమి ఆక్రమించారన్నారు. దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా, వారు పోలీసులను కలవాలని సూచించారన్నారు. పోలీసులను సంప్రదించగా.. అది సివిల్ వివాదమనీ, కోర్టులో తెల్చుకోవాలని చెప్పారన్నారు. తాను కోర్టుకు వెళ్లి ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నా, తన భూమిని తనకు అప్పగించడానికి పోలీసులు సహకరించడంలేదని ఆవేదన చెందారు. రెవెన్యూ, పోలీసు అధికారులు ఉద్దేశపూర్వకంగా తనకు సహకరించడంలేదని మండిపడ్డారు. తన భూమి ఇప్పించి, న్యాయం చేయాలని కోరారు.



సీఆర్‌పీఎఫ్ జవాను చెన్నారెడ్డి

సత్వర న్యాయం చేయండి: ఎస్పీ



సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ

పుట్టపర్తిరూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చే అర్జీల్లో చట్ట పరిధిలో వెంటనే పరిష్కరించి, సత్వర న్యాయం చేయాలని సంబంధిత పోలీసు అధికారులను ఎస్పీ రత్న ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో 55 అర్జీలు అందాయి. వాటిని స్వీకరించిన ఎస్పీ.. ఫిర్యాదుదారులతో వివరాలు తెలుసుకున్నారు. సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్, మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ ఆదినారాయణ పాల్గొన్నారు.

ఆసుపత్రి శిథిలం.. అందని వైద్యం..!

- వైసీపీ నిర్వాకంతో ఆగిన భవన నిర్మాణం
- 30 పడకల ఆసుపత్రి కలేనా..?
- ముదిగుబ్బలో ప్రథమ చికిత్సలతోనే సరి..
- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హామీ నెరవేరేనా..?




శిథిలావస్థలో ఉన్న ప్రస్తుత పీహెచ్‌సీ భవనం

ముదిగుబ్బ, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ముదిగుబ్బలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉన్న దాంట్లో కూడా తగినన్ని గదులు లేకపోవడంతో వైద్య సేవలు అందించడానికి ఇబ్బందికరంగా మారింది. గత టీడీపీ ప్రభుత్వం రూ.90 లక్షలతో నూతన భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. పనులు శ్లాబ్ వరకు పూర్తయ్యాయి. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ నిర్మాణానికి ఒక్క పైసా కూడా విడుదల చేయలేదు. దీంతో భవన నిర్మాణం ఆగిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో.. భవన నిర్మాణాన్ని పూర్తి చేసి ఆధునిక వైద్య సేవలు అందిస్తారని మండల వాసులు ఆశలు పెట్టుకున్నారు. ఎన్నికల సమయంలో మండల కేంద్రంలోని పీహెచ్‌సీని 30 పడకల ఆసుపత్రిగా ఏర్పాటు చేస్తామని సత్యకుమార్ యాదవ్ హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఆయన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్నారు. 30 పడకల ఆసుపత్రిని త్వరగతిన ఏర్పాటు చేసి హామీని నెరవేర్చావాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రథమ చికిత్సలతో సరి..

ఈ వైద్యశాల ప్రథమ చికిత్సలకే పరిమితమయింది. ఏదైనా ప్రమాదం జరిగితే అత్యవసర చికిత్సల కోసం కదిరి, బత్తలపల్లి, అనంతపురానికి వెళ్లాల్సిందే. ఇలా అనేకమంది అత్యవసర చికిత్సలు అందక మార్గ మధ్యంలోనే మరణించిన సంఘటనలు ఉన్నాయి. చిన్నపాటి అనారోగ్యాలకు సైతం కదిరి, బత్తలపల్లి, అనంతపురం ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మెరుగైన వైద్యం అందించాలి



నిత్యం వైద్యులు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యం అందించాలి. చిన్న చిన్న అనారోగ్య సమస్యలకు కూడా కదిరి, బత్తలపల్లి, అనంతపురం వెళ్లాల్సి వస్తోంది. వెంటనే ఆసుపత్రి భవన నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేలా పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవాలి.

-సుబ్బయ్య, ముదిగుబ్బ

భవనాలను పూర్తి చేయాలి



ముదిగుబ్బ చుట్టూ బైపాస్ రోడ్డు ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. క్షతగాత్రులకు ప్రథమ చికిత్సలతోనే సరిపెట్టి కదిరి, బత్తలపల్లికి తరలిస్తున్నారు. పరిస్థితి విషమించి మార్గ మధ్యంలోనే మరణిస్తున్నారు. ఆసుపత్రి భవన నిర్మాణం పూర్తి చేసి పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందించాలి.

-దామోదర్ నాయుడు, ముదిగుబ్బ

శభాష్.. రామాంజనేయులూ..!

- బదిలీలు చాలా చక్కగా ఉన్నాయ్..!
- వెల్ఫేర్ అసిస్టెంట్ల బదిలీలకు ఆమోదం
- ఉన్నతాధికారుల సంపూర్ణ మద్దతు



అనంతపురం విద్య, జూలై 7(ఆంధ్రజ్యోతి): బదిలీల్లో అక్రమాలు జరుగుతున్నాయని ఆందోళన చేసినా.. అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేసినా ఆయన ఏమాత్రం తగ్గలేదు. కౌన్సెలింగ్ ప్రక్రియలో గందరగోళం ఏర్పడి.. మరుసటి రోజుకు వాయిదా పడినా బెదరలేదు. తెరవెనుక ఎవరైనా ఉన్నారో.. తెరముందు తానే ఉన్నారో తెలియదు గానీ.. అంతా ఆయన అనుకున్నట్లే నడిపించారు. ఆయనే.. సోషల్ వెల్ఫేర్ డీడీ రామాంజనేయులు. అనేక వివాదాల నడుమ ఆయన కౌన్సెలింగ్ ప్రక్రియను పూర్తి చేశారు. బాధితులు కలెక్టర్ వినోద్ కుమార్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది. డీడీ ఇచ్చిన జాబితాకు ఉన్నతాధికారులు ఆమోద ముద్ర వేశారు. ఆర్డర్ కాపీలు ఆదివారం ఉద్యోగుల వాట్సాప్ గ్రూపుల్లో పెట్టారు. దీంతో డీడీ రామాంజనేయులు పనితీరుపై 'ప్రశంసల వర్షం' కురుస్తోంది. ఆయన తన పవర్ ఏమిటో నిరూపించుకున్నారని పలువురు వ్యాఖ్యానించారు. ఉన్నతాధికారులు, పాలకపక్ష ప్రజా ప్రతినిధులు ఆయనను ఏమీ అనలేకపోయారని అంటున్నారు.

ఆక్రందనల నడుమ..

ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న వెల్ఫేర్ అసిసెంట్స్‌కు అనంతపురంలోని అంబేడ్కర్ భవన్‌లో డీడీ రామాంజనేయులు ఆధ్వర్యంలో ఇటీవల బదిలీల కౌన్సెలింగ్ జరిగింది. తొలిరోజే ఖాళీలను చూపించకపోవడంతో వెల్ఫేర్ అసిస్టెంట్స్ పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ఇదేమి అన్యాయమని నిలదీశారు. కొందరు కలెక్టర్‌ను కలిసి తమకు జరుగుతున్న అన్యాయం గురించి వివరించారు. ఆ రాత్రికే కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. సచివాలయ ఉద్యోగుల బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. మరుసటి రోజు అదే అంబేడ్కర్ భవన్‌లోనే బదిలీల కౌన్సెలింగ్ ప్రారంభమైంది. వేదికపై ఉన్న అధికారులు సచివాలయాల ఉద్యోగులను సీనియార్టీ జాబితా మేరకు పిలిచారు. ఆ వేదిక సాక్షిగా, వందలాది మంది ఉద్యోగుల ఎదుట డీడీ తన హవా ఏమిటో చూపించారు. ఒక్కో వెల్ఫేర్ అసిస్టెంట్ లోపలికి రాగానే.. 'ఏం పేరు...? చూడప్పా.. ఈయన పేరిట ఎమ్మెల్యే, నాయకులు సిఫార్సు లేఖ ఇచ్చారా..?' అని మైక్ పట్టుకుని మరీ ప్రశ్నించారు. సిఫార్సు లేఖ ఉంది అంటే చాలు.. 'నీకు ఏ ప్లేస్ కావాలో తీసుకో...' అని కోరిన చోటును కేటాయించారు. లేఖ లేదంటే మాత్రం 'ఫలానా ప్లేస్ ఉంది.. అక్కడికి పో' అని ఏకపక్షంగా ఆదేశిస్తూ.. రికార్డులలో రాయించారు. కోరుకున్న స్థానాలలో ఏ ఒక్కటీ రాకపోగా, జాబితాలో మొదటి వరుసలో ఉన్నా దూర ప్రాంతాలను కేటాయించారని బాధితులు లబోదిబోమన్నారు. కౌన్సెలింగ్‌లో మహిళా ఉద్యోగుల పట్ల దయ చూపలేదు. 'సార్.. అంత దూరం ఎలా వెళ్లగలం.. దగ్గరలో చూపించండి' అని కౌన్సెలింగ్ హాల్‌లోనే కన్నీరు (మిగతా 6లో...)

వైసీపీ నాయకుడి కోల్డ్ స్టోరేజ్‌పై విజిలెన్స్ దాడులు

- చింతపండు, ఎండుమిర్చి నిల్వల పరిశీలన
- రికార్డులు తీసుకెళ్లిన అధికారులు



గోదాములో వైసీపీ నాయకుడు కొండూరు వేణుగోపాలరెడ్డితో మాట్లాడుతున్న విజిలెన్స్ అధికారులు

హిందూపురం, జూలై 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైసీపీ నాయకుడికి చెందిన ఏసీ గోదాములపై విజిలెన్స్ అధికారులు మెరుపుదాడులు చేశారు. సోమవారం విజిలెన్స్ సీఐ శ్రీనివాసులు, వ్యవసాయాధికారి వాసుదేవ, డీసీటీఓ సురేష్‌బాబు సిబ్బంది వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలో ఉన్న వైసీపీ నాయకుడు కొండూరు వేణుగోపాలరెడ్డికి చెందిన ఏసీ గోదాములపై దాడులు చేశారు. ఈ సందర్భంగా మొదట స్టాకుకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకొని గోదాముల్లో నిల్వ ఉన్న చింతపండు, ఎండుమిర్చి నిల్వలను లెక్కించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గోదాముల్లో ఉన్న స్టాకును తనిఖీ చేశారు. మరో గోదాములో తనిఖీలు ప్రారంభించారు. అప్పటికే చీకటి పడటంతో అధికారులు వెనుదిరిగారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసులు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఏసీ గోదాముల్లో నిల్వ ఉన్న చింతపండు, ఎండుమిర్చి స్టాకుని పరిశీలించామని, అక్కడ ఉన్న రికార్డులను పరిశీలించామని తెలిపారు. స్టాకు ఉంచిన వ్యాపారులు జీఎస్టీ ఎగ్గొట్టి ఉంటే చట్టపరమైన చర్యలు ఉంటాయని వివరించారు.

వైసీపీలో అలజడి

హిందూపురం నియోజకవర్గ వైసీపీ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాలరెడ్డికి చెందిన ఏసీ గోదాముల్లో విజిలెన్స్ తనిఖీలు చేయడంతో ఆ పార్టీలో అలజడి నెలకొంది. మంగళవారం వైఎస్ఆర్ జయంతి కార్యక్రమం జరగనుంది. ఈసారి ప్రస్తుత వైసీపీ ఇన్‌చార్జ్‌గా ఉన్న దీపికాతో పాటు కొండూరు వేణుగోపాలరెడ్డి కూడా పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కొన్ని రోజులుగా దీపికా వర్సెస్ కొండూరు వేణుగోపాలరెడ్డి అన్న టాక్ వినిపడుతోంది. సోమవారం వేణుగోపాలరెడ్డి ఏసీ గోదాముల్లో దాడులు జరగడం కలకలం రేపింది.

విసిత్రాలు..!


కొత్తచెరువు, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సత్యసాయి ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మించి 25 సంవత్సరాలైంది. ఏనాడూ రంగులు వేయలేదు. 1971లో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల నిర్మించారు. ఏనాడూ రంగులు వేయలేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 10వ తేదీన కొత్తచెరువుకు వస్తుండడంతో కళాశాల, పాఠశాలకు కొత్త కళ వచ్చింది. రంగులు వేస్తున్నారు. ప్రహరీలకు చిత్రాలు గీస్తున్నారు. ఎట్టైతేనేం.. ఏళ్లుగా ఉన్న సమస్యలు పరిష్కారమవుతుండడంతో టీచర్లు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ట్రాన్స్‌కో అధికారుల సైతం నూతన ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్లపై గుంతలను పూడ్చే చర్యలు చేపట్టారు. ఇక కరెంటు కోతలు ఉండవని కొత్తచెరువు వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ప్రహరీపై చిత్రాలు వేస్తున్న కళాకారులు

ప్రశాంతి నిలయంలో ఉచిత వైద్యశిబిరం

ఆకట్టుకున్న రామకథ నాటిక



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఆర్‌జే రత్నాకర్

పుట్టపర్తి, జూలై 7(ఆంధ్రజ్యోతి): ప్రశాంతినిలయంలోని ఉత్తర భవనం వద్ద సోమవారం ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ తొలుత సత్యసాయి చిత్రపటానికి పూజలు చేసి, వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. శ్రీసత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో 5 రోజులపాటు ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు రత్నాకర్ తెలిపారు. డాక్టర్ గీతాకామత్, డాక్టర్ అక్షయ్‌కళాతియా ఆధ్వర్యంలో 60 మంది డాక్టర్లు వైద్యశిబిరంలో పాల్గొన్నారు. సాయంత్రం సాయికుల్వంత్ సభామండపంలో విద్యార్థులకు వేసవి తరగతులు నిర్వహించారు. పద్మశ్రీ నివేదిత.. భారతీయ సంస్కృతి, మానవతా విలువల గురించి వివరించారు. అనంతరం హయ్యర్ సెకండరీ స్కూల్ విద్యార్థులు రామకథా నాటికను ప్రదర్శించారు. రామాయణంలోని పలు ఘట్టాలను ప్రదర్శిస్తూ భక్తి తన్మయత్వంలో ముంచారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

జిల్లా మలేరియా అధికారి ఓబులు సూచన

అనంతపురం వైద్యం, జూలై7(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి ఓబులు సూచించారు. సోమవారం హెల్త్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓబులు మాట్లాడుతూ.. గ్రామాల్లో పర్యటించి వ్యాధుల తీవ్రతను గుర్తించాలన్నారు. సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ప్రజాపరిషత్ అధికారులు, సచివాలయాల సిబ్బందికి సమస్యలను వివరించాలన్నారు. ప్రతిగ్రామంలో పారిశుధ్య పనులు సక్రమంగా జరిగేలా పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓలు గిరిధర్‌రెడ్డి, మద్దయ్య, కోదండరామిరెడ్డి, రామకృష్ణ, నాగేంద్రప్రసాద్, మునాఫ్, తిరుపాలయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.


కష్టపడి చదువుకో.. బతుకు బాగుంటాది..


కట్టాలన్నీ తీరుతాయ్ పో తల్లీ..

చిలుక పలుకు..!

రాత బాగుంటే
రివ్వున ఎగిరేదాన్ని..
పచ్చని చెట్టుపై జంటగా వాలి
కోరిన పండ్లను కొరికి తినేదాన్ని..!

పంజరంలో చిక్కి..
పట్టుకున్నవాడు పలకమన్నట్లు పలికేదాన్నా..?
తలుపు తెరవగానే ఏదో ఓ పేక ముక్క తీసి..
పడేసి వెళుతున్నానేగానీ,
అందులో ఏముందో నాకు మాత్రం తెలుసునా..?

నా జాతకమే బాగుంటే..
రెక్కలుండీ ఎగరకపోదునా..?
ఏదో సరదాకి అయితే సరే..
నేనేదో తీశానని..
వీరేదో చెప్పారని..
నమ్మి మోసపోతే..
నాకు సంబంధం లేదు..!
(గూగూడులో సోమవారం)



- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి


ఇంకో యాడాదై ఈ బిడ్డా.. మంచి మొగుడొస్తాడు..


ఓ నల్లమూతులోడు.. నీకు సెడుపు సేత్తాండాడు..

17 నుంచి జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ఈనెల 17వ తేదీ నుంచి స్థానిక నాయక్‌నగర్‌లోని స్మాష్ స్టేడియంలో నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని అనంతపురం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు బుగ్గయ్యచౌదరి, జయకుమార్ తెలిపారు. బాలబాలికలు, వెటరన్ విభాగాల్లో సింగిల్స్, డబుల్స్ పోటీలు ఉంటాయన్నారు. అండర్-11కి 2015 జనవరి 1వ తేదీ తరువాత, అండర్-12కి 2013 జనవరి 1 తరువాత, అండర్-15కి 2011 జనవరి 1 తరువాత, అండర్-17కి 2009 జనవరి 1 తరువాత, అండర్-19కి 2007 జనవరి 1 తరువాత జన్మించిన వారు అర్హులన్నారు. ఆసక్తి, అర్హతగల వారు ఈనెల 10వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, క్రీడా కిట్లు తెచ్చుకోవాలన్నారు. వివరాలకు 9440605819 నంబరులో సంప్రదించాలని కోరారు.

అరణ్యంలో ఆకలి కేకలు..!

- మేత దొరక్క వన్యప్రాణులు విలవిల
- పంటలను మేస్తున్న వైనం
- నష్టపోతున్న అన్నదాతలు

అమడగూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): అడవుల్లో ఆకలిదప్పులతో వన్యప్రాణులు విలవిల్లాడుతున్నాయి. మేత కరువవుతోంది, నీరు కూడా దొరకట్లేదు. దీంతో వన్యప్రాణాలు పొలాల వైపు వస్తున్నాయి. పంటలను మేస్తుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మండలవ్యాప్తంగా 1500 ఎకరాల్లో పంటలు సాగుచేశారు. వాటిని కాపాడుకోవడానికి రాత్రింబవళ్లు కాపలా కాయలేకపోతున్నామని రైతులు వాపోతున్నారు.


తిమిరికుంటపల్లి వద్ద జింకలు మేసిన పంట

నీరు, మేత కరువు

అడవుల్లో నీరు, మేత కరువవడంతో మైదాన ప్రాంతాల వైపు అడవి పందులు, జింకలు, నెమళ్లు వస్తున్నాయి. ఎలుగుబంట్లు, అడవి వంకలు, వాగులను ఆవాసాలుగా మార్చుకుంటున్నారు. సమీప పొల్లాలో మొలకెత్తుతున్న మొక్కలను నెమళ్లు తింటున్నాయి. వేరుశనగ, మొక్కజొన్న, సజ్జ, అలసంద, టమోటా మొక్కలు లేతగా ఉన్న సమయంలో జింకలు మేస్తున్నట్లు రైతులు ఆందోళన చెందుతున్నారు. కోత దశలోని పంటలకు అడవి పందులు, ఎలుగుబంట్ల బెడద తప్పడం లేదంటున్నారు. మండలంలో కంచెనగారిపల్లి, చినగానపల్లి, చినపానిపల్లి, తిమిరికుంటపల్లి.. కొండలకు సమీపంలో ఉన్న గ్రామాల్లో వీటి బెడద ఎక్కువైందని రైతులు అంటున్నారు. గ్రామాల్లో జింకలు, నెమళ్లు మందలు మందలుగా చేరుతున్నాయి. అడవి పందుల సమస్య అధికంగా ఉంది. పంటలు సాగు చేయాలంటేనే భయపడాల్సి వస్తోందని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అటవీ శాఖాధికారులు వన్యప్రాణుల బారి నుంచి పంటలను రక్షించే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

కొరవడిన చర్యలు

అడవిలో నిప్పు రాజుకోకుండా, వన్యప్రాణులకు తాగునీటి సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత అటవీ శాఖదే. ఆ దిశగా చర్యలు నామమాత్రంగానే కనిపిస్తున్నాయి. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు, అడవి జంతువులకు తాగునీటి తొట్టెలు ఏర్పాటు చేయట్లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అడవిజంతువుల కారణంగా వాటిల్లిన నష్టాన్ని జిల్లా అధికారులకు సమాచారం అందించి, పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

నెమళ్ల బెడద ఎక్కువ



నాలుగెకరాల్లో సజ్జ సాగుచేశా. మొలకెత్తిన పంటను నెమళ్లు తినేస్తున్నాయి. అప్పులు చేసి పంటలు సాగు చేస్తే నెమళ్లు మేసేస్తుండడంతో నష్టపోతున్నా. అధికారులు పరిహారం అందించేలా చూడాలి.

- లక్ష్మీనారాయణ, పత్రివాండ్లపల్లి

తగిన చర్యలు చేపడతాం

అడవుల్లో మేతలేక పచ్చని పొలాలను వన్యప్రాణులు తింటున్నది నిజమే. పొలాలను పరిశీలించి, ఉన్నతాధికారులకు నివేదికలు పంపి, పరిహారం అందేలా చూస్తాం. వన్య ప్రాణులకు అడవిలోనే నీరు తదితర సదుపాయాలు కల్పిస్తాం.

- గుర్రప్ప, రేంజ్ అధికారి, కదిరి

ఎకరాలో పంట తినేశాయి



జింకలు, ఎలుగుబంట్లు ఎకరాకుపైగా మొక్కలు మొదలు వరకు తినేశాయి. పంటను కాపాడుకోవడానికి రాత్రి సమయంలో పొలంలోనే పడుకుని కాపాలాకాయాల్సిన దుస్థితి ఏర్పడింది. వీటి బెడదతో పంటలు సాగుచేయాలంటే ఆలోచించాల్సి వస్తోంది.

- ఫక్కీరప్ప, తిమిరికుంటపల్లి

మేళా.. మేలా..?

(5వ పేజీ తరువాయి)

సంతోషంగా లేరా..? అంటే.. మెజార్టీ బాధితులు అవుననే అంటున్నారు. దీనికి కారణం.. రికవరీ చేసినా వెంటనే తిరిగి ఇవ్వకపోవడం. నెలల తరబడి నిల్వ చేసి, భారీ మొత్తంలో పోగయ్యాక అందరినీ పిలిచి ఇవ్వడం. ఫోన్ లేకుండా ఒక్క నిమిషం గడపలేరు. విద్యార్థి మొదలు వృద్ధుడి వరకూ స్మార్ట్ ఫోన్‌లను వినియోగిస్తున్నారు. కాలక్షేపం, సమాచారం, చదువు, శిక్షణ, ఉద్యోగం.. ఇలా అన్నీ అందులోనే ఇమిడి ఉన్నాయి. ఒకప్పుడు కంప్యూటర్‌లో నిక్షిప్తమైన సమాచారం ఇప్పుడు స్మార్ట్ ఫోన్‌లకు బదిలీ అయ్యింది. అన్ని సేవలూ అరచేతిలోకి వచ్చేశాయి. అలాంటి ఫోన్ పోతే.. వెంటనే దొరికితే పరవాలేదు. లేదంటే మరొకటి కొనాల్సిందే..! తప్పదు..! ఒకటి కొన్న తరువాత పోగొట్టుకున్న ఫోన్ దొరికినా, సమాచార పరంగా పెద్దగా ఒరిగేది ఉండదు.

ప్రపంచం పోయినట్లే..

రికవరీ చేసిన తరువాత నెలల తరబడి ఇవ్వకుండా నిల్వ చేస్తున్నారు. ఆ సమయంలో చార్జింగ్ లేక ఖరీదైన ఫోన్‌లు పాడైపోతున్నాయి. సిమ్ మార్చిన కారణంగా అందులో ఉన్న యాప్స్ పనిచేయవు. ఇది విద్యార్థులు, ఉద్యోగులకు తీవ్ర ఇబ్బందికరం. స్మార్ట్ ఫోన్‌లలో చదువులకు సంబంధించిన సర్టిఫికెట్లు, రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు, డ్రైవింగ్ లైసెన్సులు, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు.. ఇలా అన్నీ నిల్వ చేసుకుంటారు. ఉద్యోగులు తమ కార్యాలయ ఫైల్స్, డేటాను నిక్షిప్తం చేసుకుంటారు. ఇంట్లో ఉన్నా, బయట ఉన్నా.. ఫోన్ ద్వారానే తమ సమస్యలను పరిష్కరించుకుంటారు, విధులు నిర్వర్తిస్తారు. ఇక సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల గురించి చెప్పాల్సిన పనేలేదు. వారి ప్రపంచమే అందులో ఉంటుంది. ఇలాంటివారు కనీసం రూ.50 వేలు.. ఆపై రూ.లక్షల విలువైన ఫోన్‌లను వాడుతుంటారు. ఫోన్ పోతే.. సమాచారం పోతుంది. కొత్త ఫోన్ కొనేందుకు భారీగా డబ్బు వెచ్చించాల్సి వస్తుంది. రికవరీ చేసి.. సకాలంలో బాధితులకు ఇవ్వకపోతే జరిగే నష్టం ఇది.

12, 594 ఫోన్లు రికవరీ

పోయిన ఫోన్‌ల రికవరీకి జిల్లా పోలీస్‌శాఖ మూడేళ్ల క్రితం ప్రత్యేక చర్యలు చేపట్టింది. 2022 జూన్ 26న చాట్‌బాట్ సేవలు ప్రారంభించారు. చోరీకి గురైన, పడేసుకున్న ఫోన్‌ల జాడ కనిపెట్టి, వాటిని రికవరీ చేసి బాధితులకు ఇవ్వడం ప్రారంభించారు. సెల్‌ఫోన్‌లను పోగొట్టుకున్నవారు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్‌లో (సీఈఐఆర్) నమోదు చేసుకోవాలి. ఇందులో వేలాదిమంది బాధితులు రిజిస్టర్ చేసుకున్నారు. ఈ మూడేళ్ల కాలంలో జిల్లా పోలీసు శాఖ ఏకంగా 12,594 సెల్‌ఫోన్‌లను రికవరీ చేసి, బాధితులకు ఇచ్చారు. ఇందులో 20 ఇతర రాష్ట్రాలకు చెందిన 1,179 ఫోన్లు ఉన్నాయి. అనంతపురం జిల్లాయేతరులవి 2,795 ఫోన్‌లు ఉన్నాయి. ఒక్కొక్క ఫోన్ విలువ సగటున రూ.10 వేలు అనుకున్నా.. రికవరీ చేసిన ఫోన్‌ల విలువ రూ.12 కోట్లకు పైగా ఉంటుంది. ఇది మామూలు విషయం కాదు. పోలీసు శాఖ పనితీరును అభినందించాల్సిందే. కానీ, ఈ కష్టానికి తగిన ఫలితం బాధితులకు చేరాలి కదా..?

మచ్చుకు కొన్ని..

- జిల్లాలోని ఓ పట్టణానికి చెందిన మహిళా ఉద్యోగి ఫోన్ చోరీకి గురైంది. పోలీసులకు ఫిర్యాదు చేస్తే.. వెంటనే రికవరీ చేశారు. విషయం తెలుసుకుని, ఆ స్టేషన్ అధికారిని ఆమె కలిశారు. తన ఫోన్ ఇవ్వమని అడిగితే, జిల్లా కేంద్రంలో అప్పగించామని, రికవరీ మేళాలో ఇస్తారని చెప్పారు. అంతవరకూ ఫోన్ లేకపోతే తాను ఇబ్బంది పడతానని, విధి నిర్వహణకు సంబంధించిన ఫైల్స్, యాప్స్ అన్నీ అందులో ఉన్నాయని ఆమె వివరించారు. అయినా ఫలితం లేకపోయింది. దీంతో ఆ శాఖలో తెలిసినవారిని సంప్రదించి, అతి కష్టమ్మీద రికవీరి చేసిన ఫోన్‌ను తీసుకోగలిగారు.
- శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన ఓ రైతు సెల్‌ఫోన్ పోగొట్టుకున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే.. ఎనిమిది నెలల తరువాత రికవరీ చేసి ఇచ్చారు. 'ఇన్ని నెలల తర్వాత ఫోన్ ఇస్తే ఏం లాభం?' అని బాధిత రైతు నిట్టూర్చారు. పోలీసులు రికవరీ చేశారు కాబట్టి తీసుకుంటున్నాం. ఇది ఏమాత్రం పనిచేస్తుందో చూడాలి. దొరుకుతుందేమో అని కొన్నాళ్లు ఎదురుచూసి.. కొత్త ఫోన్ కొనుకున్నా..' అని ఆ రైతు అన్నారు.


సెల్‌ఫోన్లను అందజేస్తున్న ఎస్పీ జగదీష్ (ఫైల్)

- గుత్తి ప్రాంతానికి చెందిన ఓ యువకుడు ఇంజనీరింగ్ చదువుతున్నాడు. సుమారు 9 నెలల క్రితం అతని సెల్‌ఫోన్ చోరీ అయింది. పోలీసులకు ఫిర్యాదుచేశాడు. చాలా రోజులు రికవరీ చేయకపోవడంతో కొత్త ఫోన్ కొన్నాడు. ఇటీవల పోలీసులు అతన్ని పిలిచి, ఫోన్‌ను రికవరీ చేశామని ఇచ్చారు.
- అనంతపురం నగరానికి చెందిన ఓ పెయింటర్ నాలుగు నెలల క్రితం పాతూరులో ఫోన్ పోగొట్టుకున్నాడు. బైక్ డిక్కీలో ఉంచిన ఫోన్‌ను ఎవరో చోరీ చేశారు. ఆ తరువాత రెండు రోజుల్లోనే యూపీఐ యాప్స్ బాధితుడి బ్యాంకు ఖాతా నుంచి రూ.2 వేల వరకూ డబ్బులు లాగేశారు. పోయిన ఫోన్ సైబర్ నేరగాళ్ల చేతిలో పడితే బ్యాంకు ఖాతాలను లూటీ చేసేస్తారు.

వెంటనే ఇచ్చేయాలి..

ఒకప్పుడు టైం ఈజ్ మనీ..! ఇప్పుడు ఇన్ఫర్మేషన్ ఈజ్ వెల్త్..! అలాంటి సంపద నిక్షిప్తమైన సెల్‌ఫోన్‌లను తిరిగి ఇవ్వడమంటే కొందరికి జీవితాన్ని తిరిగి ఇవ్వడమే. అందులో విలువైన వ్యక్తిగత సమాచారం ఉంటుంది. మరీ ముఖ్యంగా విద్యార్థినులు, యువతులు, మహిళల స్మార్ట్ ఫోన్‌లు ఇతరుల చేతుల్లో పడితే జరిగే నష్టాన్ని అంచనా వేయలేం. అందుకే, ఫోన్‌ల రికవరీ అన్నది చాలా గొప్ప కార్యక్రమం. కానీ, ఆ ఫలాలు బాధితులకు దక్కినప్పుడే లక్ష్యం నెరవేరినట్లు. దొరికిన ఫోన్‌లు దొరికినట్లే.. స్థానిక పోలీస్ స్టేషన్‌లలో ఇవ్వడం ప్రయోజనకరం. కనీసం వారంలో ఒక రోజో, నెలకు రెండు రోజులో ఈ కార్యక్రమాన్ని ఎక్కడికక్కడ ఏర్పాటు చేయాలి. ఆరు నెలలకు, ఏడాది ఒకసారి జిల్లా కేంద్రంలో రికవరీ ప్రగతి గురించి మీడియాకు వివరాలు ఇవ్వొచ్చు..! ఆ దిశగా పోలీసు శాఖ ఉన్నతాధికారులు ఆలోచించాలి.

- అనంతపురం క్రైం, ఆంధ్రజ్యోతి

కరివేపాకు రైతు కుదేలు

- కిలో రూ.4కి పడిపోయిన ధర
- మూడునెలల క్రితం కిలో రూ.45..
- పంటను రక్షించుకునేందుకు లక్షల ఖర్చు

తాడిపత్రి, జూలై 7(ఆంధ్రజ్యోతి): కరివేపాకు రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. మూడునెలల వ్యవధిలోనే ధర గణనీయంగా పడిపోయింది. ఏప్రిల్ నెలలో కిలో రూ.45 ఉన్న కరివేపాకు ధర అధఃపాతాళానికి పడిపోయింది. నేడు కిలో నాలుగు రూపాయలకు చేరిందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతోంది. రైతులకు పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు. పంటను కోసి ఇతర ప్రాంతాలకు సరఫరా చేయడం వల్ల లాభం రాకపోగా నష్టాలు భరించాల్సి వస్తోంది. కూలి, రవాణా ఖర్చులు తడిసి మోపెడవుతుండడంతో కరివేపాకు పంటపై రైతులు ఆశలు వదులుకున్నారు. తాడిపత్రి మండలంలో 500 ఎకరాలు, పెద్దపప్పూరులో 800, యాడికిలో 100, యల్లనూరులో 50 ఎకరాలు, పుట్లూరు మండలంలో 100 ఎకరాల్లో కరివేపాకు సాగుచేస్తున్నారు. ఒకప్పుడు ఒడిశా నుంచి కరివేపాకు విత్తనాలు వడ్లపూడి, మంగళగిరి, గుంటూరు ప్రాంతాలకు సరఫరా అయ్యేవి. అక్కడి నుంచి రైతులు తాడిపత్రికి తీసుకొచ్చి విక్రయించేవారు. ప్రస్తుతం ఆ ప్రాంతాల్లో కూడా కరివేపాకు అధిక విస్తీర్ణంలో సాగవుతోంది. దీంతో తాడిపత్రి కరివేపాకుకు డిమాండ్ పడిపోయింది. తాడిపత్రి మండల రైతులు ఇతర ప్రాంతాలకు చెందిన వారి పొలాలను గుత్తకు తీసుకొని కరివేపాకును సాగుచేయడమే కాకుండా అక్కడివారికి ఈ పంటను పరిచయం చేశారు. తాడిపత్రి ప్రాంత కరివేపాకు హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, ముంబై, చెన్నై, బెంగళూరు తదితర నగరాలకు రవాణా అవుతోంది.


కరివేపాకు పంట

పెద్దఎత్తున కొత్త బోర్లు

వర్షాభావ పరిస్థితులతో పాటు అడుగంటిన భూగర్భజలాల కారణంగా కరివేపాకు పంటను రక్షించుకునేందుకు తాడిపత్రి, పెద్దపప్పూరు మండలాల్లో పెద్దఎత్తున కొత్త బోర్లు వేస్తున్నారు. వర్షాలు సరిగా రాకపోవడంతో బోర్లు అడుగంటిపోయాయి. వందల ఎకరాల్లో సాగులో ఉన్న కరివేపాకును రక్షించుకునేందుకు రైతులు అధిక సంఖ్యలో బోర్లు వేస్తున్నారు. ఇందుకోసం లక్షలాది రూపాయలు ఖర్చుచేస్తున్నారు. 900 నుంచి 1000 అడుగుల వరకు బోర్లు వేస్తున్నా ఆశించిన స్థాయిలో నీరు పడడం లేదు. బోరు వేసేందుకు అడుగుకు రూ.120 నుంచి రూ.150 వరకు ఖర్చుచేస్తున్నారు. దీంతో ఒక్కో బోరుకు రూ.1.50 లక్షల వరకు ఖర్చుచేసే పరిస్థితి ఏర్పడుతోంది. చాలా వరకు బోర్లలో నీళ్లు పడలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేటు వ్యక్తుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి బోర్లు వేస్తున్నా తమకు అదృష్టం వరించడంలేదని పలువురు రైతులు వాపోతున్నారు. చెన్నైలో రెండు నుంచి మూడు రూపాయలే ధర పలుకుతోందని రైతులు చెబుతున్నారు.

దిక్కుతోచడం లేదు



ఆరు ఎకరాల్లో కరివేపాకు పంట సాగుచేశాను. గతంలో ధర బాగున్నా ప్రస్తుతం గణనీయంగా పడిపోయింది. మూడు నెలల క్రితం కిలో రూ.40 నుంచి 45 ఉన్న కరివేపాకు నేడు నాలుగు రూపాయలకు చేరుకోవడంతో దిక్కు తోచడం లేదు. మరికొన్ని రోజులు ఇదే పరిస్థితి ఉంటే అప్పులపాలు కాక తప్పదు.

-సూర్యనారాయణ, కరివేపాకు రైతు, యర్రగుంటపల్లి

పెట్టుబడులు కూడా రాలేదు



అన్ని ప్రాంతాల్లో కరివేపాకు సాగు ఎక్కువగా చేస్తుండడంతో దిగుబడి కూడా ఎక్కువగా ఉంది. దీంతో ధరలు పడిపోయాయి. పెట్టిన పెట్టుబడి కూడా రాని పరిస్థితులు ఉన్నాయి. ఆరు ఎకరాల్లో పంట సాగుచేశాను. దిగుబడి వచ్చింది కానీ రేటు లేదు. కొత్తగా బోర్ల కోసం దాదాపు రూ.4లక్షల మేర ఖర్చుచేశా.

-యుగంధర్, రైతు, యర్రగుంటపల్లి

మీ ఓనర్‌ని కలవమను..!

కియ వద్ద వాహన డ్రైవర్లకు బెదిరింపులు

రెండు ప్రాంతాల్లో ఐచర్ వాహనాల ధ్వంసం


కియ వద్ద ధ్వంసమైన ఐచర్

పెనుకొండ రూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి): 'మీ ఓనర్‌కి ఎన్నిసార్లు చెప్పాలి..? మమ్మల్ని కలవమంటే కలవరు. ఫోన్ చేస్తే ఎత్తరు. మీ ట్రాన్స్‌పోర్ట్ ఎలా జరుగుతుందో చూస్తాం..' అని కియ వద్ద దుండగులు రెచ్చిపోయారు. కార్ల తయారీ పరిశ్రమకు విడి భాగాలు తరలించే ఐచర్ వాహన డ్రైవర్లను బెదిరించారు. వాహనాల అద్దాలను ధ్వంసం చేశారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలం దుద్దేబండ సమీపంలోని కియ అనుబంధ పరిశ్రమ ఎన్వీహెచ్ కంపెనీ వద్ద సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. ఎన్వీహెచ్ కంపెనీ నుంచి కార్ల పరిశ్రమకు విడి భాగాలను పీఎంకే ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ తన వాహనాల్లో తరలిస్తుంటుంది. ఈ కంపెనీ నుంచి కమీషన్‌లు రాబట్టుకునేందుకు దుండగులు బెదిరింపులకు దిగారు. దుద్దేబండ క్రాస్ వద్దకు పీఎంకే వాహనం రాగానే బైకుల్లో సుమారు పదిమంది దుండగులు వచ్చి అడ్డగించారు. డ్రైవర్ ఆనంద్ జేబులో ఉన్న మొబైల్ ఫోన్ లాక్కున్నారు. 'మమ్మల్ని కలవమని మీ ఓనర్‌కు ఎన్నిసార్లు చెప్పినా కలవరా..?' అని డ్రైవర్‌ను బెదిరించారు. వాహనం అద్దాలను ధ్వంసం చేశారని డ్రైవర్ వాపోయాడు. ఈ సంఘటన జరిగిన అరగంట వ్యవధిలోనే పాలసముద్రంలోని మరో ఐచర్ వాహనాన్ని ధ్వంసం చేశారు. డ్రైవర్ రఫీక్‌ను బెదిరించారు. ఈ దాడిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని డ్రైవర్లు ఆనంద్, రఫీక్ తెలిపారు. తమకు ఫిర్యాదు అందలేదని కియ ఎస్ఐ రాజేష్ అన్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి యువకుడి దుర్మరణం

రామగిరి, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరు గ్రామ సమీపాన సోమవారం సాయంత్రం ట్రాక్టర్ బోల్తా పడి సాయికుమార్(23) దుర్మరణం చెందాడు. పేరూరుకు చెందిన వెల్డింగ్ మల్లేశ్ కుమారుడు సాయికుమార్ ట్రాక్టర్ తోలుకుంటూ ఇంటికి వస్తుండగా అదుపు తప్పి, పక్కనే ఉన్న కాలువలోకి బోల్తాపడింది. సాయికుమార్ మీద పడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సాయికుమార్‌కు భార్య, అంజలి, నాలుగునెలల చిన్నారి ఉన్నారు. ఎస్ఐ సుధాకర్ యాదవ్ ప్రమాద స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని ధర్మవరం ఆస్పత్రికి తరలించారు.

శభాష్.. రామాంజనేయులూ..!

(5వ పేజీ తరువాయి)

పెట్టుకున్నారు. వారి గోడు వినిపించుకోలేదు.

చక్రం తిప్పింది అతనేనా..?

బదిలీల ప్రక్రియలో ఓ వెల్ఫేర్ అసిస్టెంట్ చక్రం తిప్పాడని అంటున్నారు. కౌన్సెలింగ్ ప్రక్రియ కోసం అతన్ని కార్యాలయానికి ప్రత్యేకంగా పిలిపించుకున్నారని సమాచారం. అతని మధ్యవర్తిత్వంతోనే భారీగా అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపణలు వస్తున్నాయి. ఒక్కో ఎమ్మెల్యే సుమారు పది మందికి సిఫార్సు చేశారని, వాటిని సాకుగా చూపించి, చాలామందికి కోరుకున్న స్థానాలు ఇచ్చారని అంటున్నారు. ఆ వెల్ఫేర్ అసిస్టెంట్ ద్వారా ఒప్పందం కుదుర్చుకున్న వారికి అడిగిన స్థానాలను కేటాయించారని సమాచారం. ఇంత బహిరంగంగా కౌన్సెలింగ్‌లో అక్రమాలు జరిగినా ఉన్నతాధికారులు స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో జరుగుతున్న అక్రమాలపై ఆంధ్రజ్యోతి వరుస కథనాలను ప్రచురించింది. కలెక్టర్ స్పందించి, అప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించారు. పారదర్శకంగా బదిలీలు చేయాలని ఆదేశించారు. అయినా డీడీ రామాంజనేయులు వంటి అధికారుల తీరులో మార్పు రాలేదు. బాధితులు కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులను కలిసి గోడు వెల్లబోసుకున్నా ఫలితం లేకపోయింది. బదిలీ ఉత్తర్వుల జాబితాలో ఏ మార్పూ లేకపోవడంతో బాధితులు పలువురు కంటతడి పెట్టుకుంటున్నారు. ఈ స్థాయి హవా నడిపిన అధికారులకు ఆగస్టు 15న 'ఉత్తమ అధికారులు'గా పురస్కారాలు అందజేసి సత్కరిస్తే.. స్ఫూర్తిదాయకంగా ఉంటుంది.

భక్తిపారవశ్యం


నరసింహస్వామికి అలంకరణ

మడకశిర రూరల్, జూలై7(ఆంధ్రజ్యోతి): తొలి ఏకాదశిని పురస్కరించుకుని భక్తరహళ్ళి నరసింహస్వామి ఆలయం వద్ద సోమవారం మినీ భూతప్పల ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. నరసింహస్వామితోపాటు జిల్లేడగుంట ఆంజనేయస్వామి ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మినీ భూతప్పల ఉత్సవం వైభవంగా నిర్వహించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు, సంతానంలేని వారు స్నానం చేసి తడి గుడ్డలతో ఆలయం వద్ద భూతప్పలు వచ్చే దారిలో బోర్లా పడుకున్నారు. నరసింహస్వామి, ఆంజనేస్వామి ఉత్సవమూర్తులను జిల్లేడగుంట ఆలయం నుంచి ఊరేగింపుగా తీసుకొచ్చారు. నరసింహస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం భూతప్పల ఉత్సవాలు మొదలయ్యాయి. స్వామివారి ఉత్సవమూర్తులను తీసుకొస్తూ దారిలో పడుకున్న భక్తులపై కాలుమోపుతూ భూతప్పలు దేవాలయానికి చేరుకున్నారు. ఇలా భూతప్పలు కాలుమోపితే రోగాలు నయమవుతాయనీ, సంతానం కలుగుతుందని భక్తుల విశ్వాసం. అనంతరం భక్తులు నరసింహస్వామి ఆలయ ప్రదక్షిణ చేసి, మొక్కులు తీర్చుకున్నారు. భూతప్ప స్పర్శ కోసం ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.


భక్తులపై కాలు మోపుతూ వెళ్తున్న భూతప్ప


ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న వేదపండితులు

క్రైం కార్నర్

గంజాయి స్వాధీనం..10 మంది అరెస్ట్



పోలీసుల అదుపులో గంజాయి విక్రేతలు

రాయదుర్గం, జూలై 7(ఆంధ్రజ్యోతి): కర్ణాటక నుంచి రాయదుర్గం ప్రాంతానికి అక్రమంగా గంజాయిని తరలించి విక్రయిస్తున్న పది మందిని అరెస్ట్ చేసి 1.709 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు అర్బన్ సీఐ జయనాయక్ తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన పది మంది సులువుగా డబ్బులు సంపాదించాలన్న దురాశతో గంజాయి విక్రయానికి అలవాటు పడ్డారు. కర్ణాటకలోని బళ్లారి నుంచి తీసుకొచ్చి రాయదుర్గం, కళ్యాణదుర్గం ప్రాంతాలలో విక్రయించేలా ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. బళ్లారిలోని రైల్వేస్టేషన్, బస్టాండ్ ప్రాంతాలలో ఉన్న సాధువుల దగ్గర కిలో రూ. 25 వేలు ప్రకారం కొనుగోలు చేసి రైలు మార్గం ద్వారా జిల్లాలోకి ప్రవేశించారు. ఇక్కడికి వచ్చిన తర్వాత చిన్న చిన్న ప్యాకెట్లుగా మార్చుకుని విక్రయించేందుకు సిద్ధంగా పెట్టుకున్న కంబదూరు మండలంలోని కర్తనపర్తి గ్రామానికి చెందిన బోయ నరేష్, కొత్తూరు గ్రామానికి చెందిన కోడిపల్లి రామాంజనేయులు, చెన్నంపల్లికి చెందిన మారన్న, ఆత్మకూరు మండలం తోపుదుర్తికి చెందిన చిట్ల మారప్ప, అనంతపురం మండలం పులకుంట గ్రామానికి చెందిన వెంకటరాముడు, నగరానికి దంపట్ల జీవన్‌కుమార్, బండి ఉదయ్ కిరణ్, ఇమామ్‌సాబ్, షేక్ అన్వర్‌బాష, గార్లదిన్నె మండలంలోని పాతకల్లుకు చెందిన అంచెల రసూల్‌ఖాన్‌లు సమూహంగా ఏర్పడ్డారు. రాయదుర్గం పట్టణంలోని కణేకల్లు రోడ్డులో ఉన్న రైల్వే బ్రిడ్జి వద్ద వీరిని అదుపులో తీసుకున్నామని అన్నారు. వీరి వద్ద నుంచి 1.709 కిలోల గంజాయితో పాటు ఏడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని వీరిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు ఆదేశించినట్లు ఆయన తెలిపారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య



విష్ణువర్ధన్ (ఫైల్)

చిలమత్తూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరాపురం గ్రామానికి చెందిన విష్ణువర్ధన్ (30) ప్రేమ విఫలమై సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ మునీర్ అహమ్మద్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆదినారాయణప్ప కుమారుడు విష్ణువర్ధన్ ఒక అమ్మాయిని ప్రేమించాడు. ఆ అమ్మాయి దూరమవడంతో తీవ్ర మానసిక వేదనకు లోనయ్యాడు. దాంతో కొన్నాళ్లుగా మానసికంగా ఇబ్బంది పడుతుండేవాడు. ఈ నేపథ్యంలోనే ఇంట్లో ఎవరూలేని సమయంలో పైకప్పునకు ఉరేసుకున్నాడు. కుటుంబీకులు గుర్తించేసరికి మరణించాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని హిందూపురం ఆస్పత్రికి తరలించారు. యువకుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వాకింగ్ చేస్తుండగా.. గొలుసు అపహరణ



పుష్పవతి మెడకు గాయం

నార్పల, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని బీ పప్పూరు గ్రామం వద్ద సోమవారంతెల్లవారుజామున నెట్టెం పుష్పవతి మెడలోని మూడు తులాల బంగారు గొలుసును గుర్తుతెలియని దుండగుడు ఎత్తుకెళ్లాడు. బీ పప్పూరు గ్రామానికి చెందిన నెట్టెం కృష్ణయ్య భార్య పుష్పవతి రోజులాగానే రోడ్డు వైపు వాకింగ్‌కు వెళ్లింది. ఒంటరిగా వాకింగ్ చేస్తుండగా ద్విచక్రవాహనంలో వచ్చిన దుండగుడు.. ఆమె మెడలోని మూడు తులాల బంగారు చైన్‌ను లాక్కెళ్లాడు. దీంతో పుష్పవతి మెడ, మోకాళ్లకు గాయాలయ్యాయి. పుష్పవతి.. గ్రామస్థులను తీసుకొచ్చేలోగా దుండగుడు పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో బాలుడికి తీవ్రగాయాలు

గాండ్లపెంట, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన గగన్ అనే బాలుడు సోమవారం విద్యుత్ షాక్‌తో తీవ్రగాయాలైన సంఘటన చోటు చేసుకుంది. బాలుడి తల్లిదండ్రులు సంతోష్‌కుమార్, పవిత్ర తెలిపిన వివరాల మేరకు.. ఆరేళ్ల వయస్సున్న గగన్ పశువుల ఆసుపత్రి వద్ద ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు కట్టె వెళ్లి విద్యుత్ వైర్లకు తగినట్లు చెప్పారు. విద్యుత్ షాక్ తగలడంతో స్పృహతప్పి పోయాడని, ఎడమచేయి భాగంతో పాటు మెడపూర్తిగా కాలిపోయిందన్నారు. చికిత్స కోసం కదిరి ప్రభుత్వ ఆసుపత్రి తరలించామని అన్నారు.

మహిళ అదృశ్యం

కదిరిఅర్బన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు అప్‌గ్రేడ్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కౌలేపల్లికి చెందిన వివాహిత సాయిలీలా ఈనెల 1న ఇంటిలో నుంచి బయటకు వెళ్లి, తిరిగి రాలేదన్నారు. భర్త, కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల వద్ద విచారించినా ఆచూకి లేకపోవడంతో సోమవారం భర్త శీను ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకున్నట్లు చెప్పారు.

ఎవరిదో..?

● వారం రోజులుగా రోడ్డుపైనే కారు



రోడ్డుపై వదిలేసిన కారు

నార్పల, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాంపల్లికి వెళ్లే రోడ్డు పక్కన కారు వారం రోజులుగా ఉంది. ఎవరిదో తెలీదు. ఎవరూ తీసుకెళ్లట్లేదు. రోడ్డుపై వెళ్లేవారు కారుపై చర్చించుకుంటున్నారు. పోలీసులకు సమాచారం అందించినా పట్టించుకోవడంలేదని తెలిసింది. కారు రెండు చక్రాలు పంచర్ అయినట్లు తెలిసింది. దొంగలు వదిలేసి వెళ్లారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఎస్ఐ సాగర్‌ను అడగ్గా.. విచారణ చేస్తున్నామనీ, త్వరలోనే వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

వడ్డీ వ్యాపారుల దౌర్జన్యం

● డబ్బు కట్టలేదంటూ దాడి
● వన్‌టౌన్ వద్ద బంగారు వ్యాపారుల ఆందోళన
● ఐదుగురిపై కేసు నమోదు
● అధిక వడ్డీ వసూలు చేస్తే తాట తీస్తాం: సీఐ



ఆందోళనకారులతో మాట్లాడుతున్న సీఐ శ్రీకాంత్ యాదవ్

అనంతపురం క్రైం, జూలై 7(ఆంధ్రజ్యోతి): వడ్డీకి తీసుకున్న డబ్బు కట్టలేదంటూ... కొందరు వడ్డీ వ్యాపారులు.. దాడి చేయడం పాతూరులో పెద్దదుమారం రేపింది. బాధితులకు అండగా కొందరు బంగారు వ్యాపారులు.. వన్‌టౌన్ పోలీసు స్టేషన్ వద్ద సోమవారం ఆందోళనకు దిగారు. దాడి చేసిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అధిక వడ్డీలు వసూలు చేస్తే... తాట తీస్తామని, నడిరోడ్డుపైనే థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తామంటూ సీఐ శ్రీకాంత్ యాదవ్ తీవ్రంగా హెచ్చరించారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బంగారు వ్యాపారి బాబ్‌జాన్.. భవానీనగర్‌కు చెందిన వడ్డీ వ్యాపారి తిరుపాల్ వద్ద రూ.2 లక్షలు వడ్డీకి తీసుకున్నాడు. ఐదేళ్ల క్రితం తీసుకున్న డబ్బుకు నెలనెలా రూ.40వేల వరకూ చెల్లించాడు. ఇక వడ్డీ కట్టలేననీ, రూ.2 లక్షల మొత్తాన్ని రూ.50వేల చొప్పున నాలుగు విడతల్లో చెల్లిస్తానని వ్యాపారి చెప్పుకున్నాడు. ఉదయం ఇస్తానని చెప్పి ఇవ్వకపోవడంతో...తిరుపాల్, అతడి కుమారుడు సూరి, మరో ముగ్గురు అనుచరులతో కలిసి పాతూరులోని బాబ్‌జాన్ షాపు వద్దకు వచ్చి నిలదీశారు. డబ్బు ఎందుకు ఇవ్వలేదంటూ బాబ్‌జాన్‌పై దాడి చేశారు. అక్కడే ఉన్న బంగారు షాపుల యజమానులు సర్దిచెప్పేందుకు ప్రయత్నించిన వారు వినలేదు. బాధితుడితో కలిసి బంగారు వ్యాపారులు వన్‌టౌన్ పోలీసు స్టేషన్ వద్దకెళ్లి ఆందోళన చేశారు. కొంతసేపు వన్‌టౌన్ పరిసరాల్లో ట్రాఫిక్ జామ్ అయ్యింది. బాధితుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్, ఎస్ఐ శ్రీనివాస్.. నిందితులు తిరుపాల్, సూరి, సోము, అంజి, అసంఅలీని పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఐదుగురిపై కేసు నమోదు చేశారు. బాధితులకు సీఐ హామీ ఇవ్వడంతో వారు వెనుదిరిగారు.

అధిక వడ్డీల కోసం పీడిస్తే... తాట తీస్తాం : సీఐ శ్రీకాంత్ యాదవ్

అధిక వడ్డీల కోసం జనాలను పీడిస్తే తాట తీస్తాం. అలా వేధిస్తుంటే... బాధితులు పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయవచ్చు. కఠిన చర్యలు తీసుకుంటాం. వడ్డీ వ్యాపారులు ప్రాంసరీ నోట్ ఉంటే... కోర్టుకు వెళ్లి తెచ్చుకోవాలే తప్ప.. ఇలా ఇళ్ల వద్దకు వెళ్లి దౌర్జన్యాలు చేయడం సరికాదు. నడిరోడ్డులోనే పనిష్మెంట్ ఇస్తాం. థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తాం.

మెగా పీటీఎంపై కసరత్తు

విద్యాశాఖ, డ్వామా, డీఆర్‌డీఏ శాఖలతో కమిటీలు
కమాండ్ కంట్రోల్ నుంచే ఎంఈఓలు, హెచ్‌ఎంలకు ఆదేశాలు

అనంతపురం విద్య, జూలై7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 10వ తేదీన పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించ తలపెట్టిన మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం (పీటీఎం)పై జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. పీటీఎం నిర్వహణపై కలెక్టర్ వినోద్ కుమార్ ప్రత్యేక దృష్టిపెట్టారు. పీటీఎం నిర్వహణలో ఇతర శాఖలు భాగస్వాములు కావాలని ఆదేశించారు. తల్లి పేరున పిల్లలతో తప్పనిసరిగా మొక్కలు నాటించాలని, ఆ మొక్కకు విద్యార్థి పేరుతో జీపీఎస్ ట్యాగ్‌చేసి పెంచే బాధ్యతలను అప్పగించాలని ఆదేశాలిచ్చారు. ఇందుకు విద్యార్థికిగ్రీన్ పాస్‌పోర్టు జారీ చేయనున్నారు. దీంతోవిద్యాశాఖ, డ్వామా, డీఆర్‌డీఏ, అటవీ శాఖాధికారులు, సిబ్బందితో సోమవారం కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ సెంటర్‌లో డీఈఓ ప్రసాద్‌బాబు, సమగ్రశిక్ష ఏపీసీ శైలజ ప్రత్యేకంగా సమీక్షలు నిర్వహిస్తూ, నిర్వహణకు కమిటీలు ఏర్పాటు చేస్తూ బాధ్యతలు అప్పగించారు. అక్కడ కమాండ్ కంట్రోల్ నుంచే ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులతో కాన్ఫరెన్స్‌లలో మాట్లాడుతున్నారు. పీటీఎం నిర్వహణపై మార్గదర్శకాలు ఇస్తున్నారు.

1,747 స్కూళ్లకు రూ. 2.75 కోట్లు జమ

పీటీఎం నిర్వహణ తేదీ దగ్గర పడుతుండడంతో రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలకు మెయింటెనెన్స్ గ్రాంట్ మంజూరు చేసింది. తొలివిడతలో 50శాతం గ్రాంట్ విడుదల చేసింది. జిల్లాలోని 1,747 స్కూళ్లకు రూ.2.75 కోట్లు విడుదలకాగా.. ఆ సొమ్మును ఏపీసీ శైలజ.. ఆయా పాఠశాలలకు పిల్లల సంఖ్యను బట్టి జమ చేశారు. ఈ నిధుల్లో 20 శాతం పీటీఎం నిర్వహణకు వినియోగించుకోవచ్చని ఏపీసీ తెలిపారు. మొత్తంమీద విద్యాశాఖ, సమగ్రశిక్ష అధికారులు, సిబ్బంది పీటీఎం నిర్వహణ ఏర్పాట్లపై తలమునకలవుతున్నారు.

గుంతకల్లు మీదుగా ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు, జూలై 7(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని గుంతకల్లు రైల్వే డివిజన్ మీదుగా ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు రైల్వే అధికారులు సోమవారం తెలిపారు. సికింద్రాబాద్-అరిసికెర (వయా గుంతకల్లు) ప్రత్యేక వీక్లీ రైలు (నం 07079) ఈ నెల 17వ తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీ వరకూ ప్రతి ఆదివారం సాయంత్రం సికింద్రాబాదులో బయలుదేరి సోమవారం మధ్యాహ్నం 12-45 గంటలకు అరిసికెరెకు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 07080) ఈ నెల 14వ తేదీ నుంచి సెప్టెంబరు 1వ తేదీ వరకూ ప్రతి సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు అరిసికెరెలో బయలుదేరి మంగళవారం ఉదయం 7-45 గంటలకు సికింద్రాబాద్‌కు చేరుకుంటుందన్నారు. ఈ రైలు బేగంపేట, లింగంపల్లి, వికారాబాద్, తాండూరు, యాద్గిర్, క్రిష్ణా, రాయచూర్, మంత్రాలయం రోడ్డు, గుంతకల్లు, గుత్తి, అనంతపురం, ధర్మవరం, హిందూపురం, యల్హంక, టుముకూరు స్టేషన్ల మీదుగా వెళ్తుందని తెలియజేశారు. హైదరాబాద్-అరిసికెరె (వయా డోన్-అనంతపురం) ప్రత్యేక వీక్లీ రైలు (నం. 07069) ఈ నెల 8వ తేదీ నుంచి ఆగస్టు 26వ తేదీ వరకూ ప్రతి మంగళవారం సాయంత్రం 7-20 గంటలకు బయలుదేరి గురువారం ఉదయం 7-50 గంటలకు అరిసికెరెకు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (నం.07070) బుధవారాలలో మధ్యాహ్నం 2 గంటలకు అరిసికెరెలో బయలుదేరి గురువారం ఉదయం 7-50 గంటలకు హైదరాబాదుకు చేరుకుంటుందన్నారు. ఈ రైలు సికింద్రాబాద్, కాచిగూడ, ఉమ్దానాగర్, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తి రోడ్డు, గద్వాల, కర్నూలు సిటీ, డోన్, అనంతపురం ధర్మవరం, హిందూపురం, యలహంక, టుముకూరు స్టేషన్ల మీదుగా వెళ్తుందని వివరించారు. అలాగే కాచిగూడ-తిరుపతి (నం. 07676) ప్రత్యేక సింగిల్ ట్రిప్ రైలు ఈ నెల 8వ తేదీ ఉదయం కాచిగూడలో రాత్రి 11-30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం పన్నెండున్నరకు తిరుపతికి చేరుకుంటుందన్నారు. ఈ రైలు జడ్చర్ల, మహబూబ్‌నగర్, గద్వాల, కర్నూలు సిటీ, డోన్, గుత్తి, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట స్టేషన్ల మీదుగా వెళ్తుందని తెలిపారు.

వందే భారత్ రైలుకు అదనపు కోచ్‌లు

కాచిగూడ-యశ్వంతపూర్-కాచిగూడ మధ్య నడిచే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (నం. 20703/04) రైలుకు 8 రైలు కోచ్‌లను పెంచి నడపనున్నట్లు రైల్వే అధికారులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఎనిమిది చైర్‌కార్లతో వెళ్తున్న ఈ వందే భారత్ రైలుకు మరో ఎనిమిది చైర్‌కార్లను జతచేయనున్నట్లు తెలిపారు. ఈ రైలుకు ప్రయాణికుల ఆదరణ ఎక్కువగా ఉండటంతో ప్యాసింజర్ రవాణా సామర్థ్యాన్ని రెండింతలు చేసినట్లు వివరించారు. ఈ నెల 10వ తేదీ నుంచీ వందే భారత్ అప్ అండ్ డౌన్ రైలుకు ఏడు చైర్‌కార్ల స్థానంలో 14, ఒక ఎక్జిక్యూటివ్ క్లాస్ చైర్‌కార్ స్థానంలో రెండు ఉండేలా, 530 ప్రయాణికుల స్థానంలో 1,128 మంది ప్రయాణించేలా సామర్థ్యాన్ని పెంచనున్నట్లు వివరించారు.

8 గంటల ముందే రిజర్వేషన్ చార్ట్

గుంతకల్లు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): భారత రైల్వేలో రిజర్వేషన్ తొలి చార్ట్ తయారీ సమయాన్ని పెంచుతూ దక్షిణ మధ్య రైల్వే శాఖ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం రైలు బయలుదేరే 4 గంటల ముందు రిజర్వేషన్ తొలి చార్ట్‌ను సిద్ధం చేసి, రైలు బయలుదేరే అర గంట ముందు రెండో చార్టును ప్రకటిస్తున్నారు. దాన్ని సమర్థిస్తూ దక్షిణ మధకచ రై. జోన్ నిబంధనలను అమలుపరిచింది. ఇకపై రైలు బయలుదేరే సమయానికి 8 గంటల ముందు తొలి చార్టును సిద్ధం చేస్తారు. రెండో చార్టు ప్రిపరేషన్ సమయాన్ని యథాప్రకారంగానే కొనసాగించనన్నారు. ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల మధ్య సమయాలలో బయలేదేరే రైళ్లకు ముందు రోజు రాత్రి 9 గంటలకే తొలి చార్టును ప్రకటిస్తారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి అర్ధరాత్రి 11-59 గంటల మధ్య, తెల్లవారుజాము 12 గంటల నుంచి ఉదయం 5 గంటల మధ్యలో బయలుదేరే రైళ్లకు 8 గంటల ముందు తొలి చార్టును ప్రకటిస్తారు.

జేఎన్‌టీయూలో ఏపీఎంసెట్ హెల్ప్‌లైన్ సెంటర్

అనంతపురంరూరల్, జూలై7(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూలోని ఏపీజే అబ్దుల్ కలాం భవనంలో ఏపీ ఎంసెట్ హెల్ప్‌లైన్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు వీసీ సుదర్శన్‌రావు సోమవారం తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి అడ్మిషన్ల డైరెక్టర్ ఆచార్య సురేష్‌బాబు అందుబాటులో ఉంటారన్నారు. విద్యార్థులు.. సంప్రదించవచ్చన్నారు.

నేడు పుట్టపర్తికి రాజస్థాన్ గవర్నర్ రాక

పుట్టపర్తి టౌన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): రాజస్థాన్ గవర్నర్ హరిబానుబాగ్డే మంగళవారం పుట్టపర్తికి రానున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు గవర్నర్ పుట్టపర్తికి చేరుకుంటారన్నారు. ఆ రోజు పుట్టపర్తిలో బస చేసి, బుధవారం ఉదయం సత్యసాయి సెంట్రల్‌ట్రస్టు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. మధ్యాహ్నం ఒంటి గంటలకు తిరుగు ప్రయాణమవుతారన్నారు. బెంగళూరు వెళ్లి, అక్కడి నుంచి రాజస్థాన్ వెళ్తారన్నారు.

రెండు వర్గాల ఘర్షణ - ఒకరి మృతి

గాండ్లపెంట, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని కురుమామిడి పంచాయతీ గుట్టకిందపల్లిలో సోమవారం ఉపాధి హామీ పనుల బిల్లుల కోసం రెండు వర్గాలు ఘర్షణ పడ్డాయి. ఈ ఘర్షణలో రంగారెడ్డి(48) అనే వ్యక్తి మృతిచెందాడు. తనకు ఉపాధి హామీ పనులు కల్పించి, బిల్లులు పెట్టాలని గుట్టకిందపల్లికి చెందిన రంగారెడ్డి కురుమామిడి పంచాయతీకి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ మనోహర్‌తో గొడవకుదిగాడు. దీంతో మనోహర్‌తో పాటు దాదెప్ప మరికొంత మంది రంగారెడ్డిపై గుట్టకిందపల్లిలో దాడి చేశారు. ఈ క్రమంలో రంగారెడ్డి అదుపుతప్పి రాయిపై పడడంతో తలకు బలమైన గాయాలై మృతి చెందాడు. మృతదేహాన్ని కదిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి వివాహం కాలేదు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని సీఐ నాగేంద్ర తెలిపారు.

పంటల బీమా ప్రీమియం చెల్లించండి

● జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అర్బన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): రైతులు సకాలంలో పంటల బీమాకు ప్రీమియం చెల్లించి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన(పీఎంఎఫ్‌బీవై), వాతావరణ ఆధారిత పంటల బీమా కోసం రైతులు ప్రీమియం మొత్తాన్ని చెల్లించాలన్నారు. ఎంపిక చేసిన పంటలను పండించే రైతులు, కౌలు రైతులు రెండు పథకాలకు అర్హులని అన్నారు. నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్‌లో ఈ ఏడాది ఖరీఫ్ నుంచి నమోదు చేసుకోవచ్చన్నారు. బ్యాంకులో పంట రుణం పొందిన రైతులతో రుణం నుంచి ప్రీమియం సొమ్ము బీమా కోసం జమ చేస్తారని అన్నారు. రుణం తీసుకోని రైతులు స్వతహాగా కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా, ఎన్‌సీఐపీ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఇందుకు ఆధార్, భూమి పత్రాలు, కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డు, రైతు డిక్లరేషన్ లేనిపక్షంలో పంట వేసినట్లు ధ్రువీకరణ పత్రాన్ని ఆర్‌ఎస్‌కే సిబ్బందితో తీసుకోవాలన్నారు. ఈ పంట నమోదు చేసుకున్న పత్రం, సెల్ నెంబర్, రైతు సేవింగ్ ఖాతా వివరాలు అవసరం అన్నారు.

ప్రధాన మంత్రి ఫసల్ బీమా ఇలా..

ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన ప్రీమియం వివరాలు...

పంట పేరు	బీమా మొత్తం(హె)	రైతు చెల్లించాల్సిన మొత్తం: ఎకరాకు	రైతు చెల్లించాల్సిన మొత్తం: హెక్టారుకు	గడువు తేదీ
కంది	50,000	80	200	జూలై 31
వరి	1,02,500	164	410	ఆగస్టు 15
జొన్న	52,500	84	210	జూలై 31
మొక్కజొన్న	82,500	132	330	జూలై 31
ఆముదం	50,000	80	200	జూలై 31
ఎండు మిరప	2,25,000	576	1400	జూలై 31

ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకం కింద కంది పంటను గ్రామం యూనిట్‌గా, వరి, జొన్న, మొక్కజొన్న, ఆముదం, ఎండు మిరప పంటలను మండలం యూనిట్‌గా పరిగణించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. దిగుబడి ఆధారిత పంటల విషయంలో పంట కోత ప్రయోగాల ద్వారా లెక్కించిన వాస్తవ దిగుబడిని.. గత ఏడు సంవత్సరాల దిగుబడి ఆధారంగా లెక్కించి, దిగుబడి తగ్గినప్పుడు బీమా వర్తింపజేస్తారు.

మండలం యూనిట్‌గా వాతావరణ బీమా

వాతావరణ ఆధారిత బీమా ప్రీమియం వివరాలు..

పంట పేరు	బీమా మొత్తం(హె)	రైతు చెల్లించాల్సిన మొత్తం: ఎకరాకు	రైతు చెల్లించాల్సిన మొత్తం: హెక్టారుకు	గడువు తేదీ
వేరుశనగ	80,000	640	1600	జూలై 15
పత్తి	95,000	1140	1600	జూలై 15
దానిమ్మ	1,87,500	3,750	9,375	జూలై 15
చీనీ	1,37,500	2,750	6,875	జూలై 15
టమోటా	80,000	1600	4,000	జూలై 15
అరటి	1,50,000	3,000	7,500	జూలై 15

వాతావరణ ఆధారిత బీమా కింద జిల్లాలో వేరుశనగ, పత్తి, దానిమ్మ, చీనీ, టమోటా, అరటి పంటలకు వర్తింపజేశారు. ఆయా పంటలను మండలం యూనిట్‌గా పరిగణించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో జిల్లాలో అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ కంపెనీ ద్వారా ఈ పథకాన్ని అమలు చేస్తారు. ఈ ఏడాది జూలై 1 వతేదీ నుంచి వచ్చే ఏడాది మే నెలాఖరుదాకా ఏడాది కాలం వ్యవధిలో అల్ప, అధిక వర్షపాతం, గాలిలో తేమ శాతం, గాలి వేగం, అధిక ఉష్ణోగ్రతలకు సంబంధించిన పరిణామాలను మండల స్థాయిలో వాతావరణ పరికరాల సహాయంతో లెక్కించి, బీమాను వర్తింపజేస్తారు.

పొలాలకు దారి చూపండి

● మహిళా రైతుల డిమాండ్
● తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన



తహసీల్దార్, సర్వేయర్లతో వాగ్వాదానికి దిగిన మహిళా రైతులు

గోరంట్ల, జూలై7(ఆంధ్రజ్యోతి): తమ పొలాలకు దారి చూపాలంటూ మండలంలోని దిగువగంగంపల్లికి చెందిన మహిళా రైతులు.. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ.. గ్రామం నుంచి పొలాల్లోకి వెళ్లేందుకు పూర్వం నుంచి రోడ్డు ఉందన్నారు. గొల్ల రామకిష్టప్ప సర్వే నంబరు 47లోని రోడ్డు స్థలాన్ని ఆక్రమించుకోవడంతో ఏడాదిగా ఇబ్బంది పడుతున్నామన్నారు. తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం లేకపోయిందన్నారు. సమస్యపై తహసీల్దార్ మారుతికి ఫిర్యాదు చేశారు. సర్వేయర్ తాతయ్యను పిలిపించి రెవెన్యూ రికార్డుల మేరకు దారి చూపాలని ఆదేశించారు. దీంతో మహిళలు ఆగ్రహిస్తూ గతంలో అనేకమార్లు రెవెన్యూ అధికారులు రోడ్డు పరిశీలనకు వచ్చినా, సమస్య పరిష్కారం కాలేదంటూ సర్వేయర్‌పై ధ్వజమెత్తారు. మధ్యాహ్నం 3 గంటలకు సర్వేయర్‌తోపాటు పోలీసులు వెళ్లాలని తహసీల్దార్ ఆదేశించారు. మహిళా రైతులు అధికారులు వచ్చేవరకు వెళ్లమంటూ అక్కడే భీష్మించారు. దీంతో సర్వేయర్ వెళ్లి, రోడ్డు చూపారు. ఆందోళనలో మహిళా రైతులు ఈశ్వరమ్మ, వెంకటలక్ష్మమ్మ, అలివేలమ్మ, అనసూయమ్మ, రామచంద్రమ్మ, రజిని, లక్ష్మీనరసమ్మ, శివమ్మ పాల్గొన్నారు.

అరటి పరిశోధనా కేంద్రానికి స్థల పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

తాడిపత్రి, జూలై 7(ఆంధ్రజ్యోతి): అరటికి సంబంధించి టిష్యుకల్చర్ మొక్కల ఉత్పత్తి పరిశోధనా కేంద్రం ఏర్పాటుకు తాడిపత్రి మండలం తలారిచెరువులో కలెక్టర్ వినోద్‌కుమార్, ఢిల్లీ డీవీఎస్ఎస్ఎల్ ప్రతినిధి పరేష్‌దేశాయ్, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ప్రతినిధి జయప్రకాష్ బృందంతో స్థలాన్ని పరిశీలించారు. తలారిచెరువు సర్వేనెంబరు 18లో అనుకూలమైన వాతావరణంగా ఉందని ఇక్కడే ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. బీవీఎస్ఎస్ఐ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌లో వివిధ పంటల విత్తనాభివృద్ధి కి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ప్రతిపాదన పంపించామని అన్నారు. ముఖ్యంగా అరటి టిష్యుకల్చర్ మొక్కల ఉత్పత్తి పరిశోధన కేంద్రం అనంతపురం జిల్లాలో ఏర్పాటు చేయుటకు అన్నివిధాలా అనుకూలమైన స్థలమని పరిశీలించారు. 50ఎకరాల అరటి టిష్యుకల్చర్ ఏర్పాటుకు అవసరమైన చర్యలుతీసుకుంటామని కలెక్టర్ వారికి తెలిపారు. ప్రస్తుతం స్థలాలు ఉన్న ప్రాంతంలో నీటి సౌకర్యం, విద్యుత్ సరఫరా, రోడ్డు వసతి, నేల సామర్థ్యం వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని తెలిపారు. ఇక్కడ టిష్యుకల్చర్ అరటి ఉత్పత్తి కేంద్రం ఏర్పడితే రైతులకు నాణ్యమైన పరిశోధనాత్మకమైన పంట మొక్కలు అందించేందుకు అన్నివిధాలా వీలుంటుందని అన్నారు. తాడిపత్రి ప్రాంతం నుంచి అరటిపంట ఎక్కువ సాగు చేయడంతోపాటు వివిధ దేశాలకు పంపించేందుకు రైల్వేసౌకర్యం కూడా ఉందని బృందానికి వివరించారు. కార్యక్రమంలో తెలుగురాష్ట్రాల ప్రతినిధి తివారీ, ఆర్డీఓ కేశవనాయుడు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఉమాదేవి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ సోమశేఖర్, మండల సర్వేయర్ రాంమోహన్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో నమోదు తప్పనిసరి

● రాష్ట్ర పరిశీలన బృందం



కదిరి ఎంఈఓ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న బృందం

కదిరి, జూలై 7(ఆంధ్రజ్యోతి): పాఠశాలలకు హాజరైన ఉపాధ్యాయులు, విద్యార్థుల వివరాలు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదుచేయాలని రాష్ట్ర పరిశీలన బృందం సభ్యులు పేర్కొన్నారు. సోమవారం కదిరి, నల్లమాడ, తనకల్లు, నల్లచెరువు, తలుపుల మండలాల్లో ఈ బృందం సభ్యులు తనిఖీలు చేశారు. హాజరు నమోదులో సమస్యలు ఉంటే అప్పటికప్పుడు పరిష్కరించారు. రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు పాఠశాలకు హాజరైన ఉపాధ్యాయులు, విద్యార్థులు తప్పకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. దీనిపై ఎంఈఓలు ఉదయం, సాయంత్రం పర్యవేక్షించాలని అన్నారు. 1, 6 తరగతుల్లో అడ్మిషన్ల వివరాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం ఎంతమందికి ఇస్తున్నారు, పాఠశాలకు ఎంతమంది హాజరయ్యారన్న విషయాలను తనిఖీ చేశారు. హాజరు నమోదు చేయనివారిపై చర్యలుంటాయని తెలిపారు. ఈ బృందంలో సభ్యులు వి. సువర్ణసరోజ, ఎస్కే నాగులమీరా, యేసుబాబు, ప్రకాష్‌రెడ్డితోపాటు కదిరి ఎంఈఓలు చెన్నక్రిష్ణ, ఓబులరెడ్డి ఉన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ ఏడీ-2 వినయ్‌కుమార్‌తోపాటు, అసిస్టెంట్ జీసీడీఓ సంపూర్ణ సోమవారం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థినులకు ఉచితంగా అందించే శానిటరీ న్యాప్‌కిన్స్ గోడౌన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో విద్యాశాఖ ప్రతినిధులు లోకేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

న్యూస్ బాక్స్

తహసీల్దార్ జమానుల్లాఖాన్ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు చేపట్టిన జమానుల్లాఖాన్

నల్లచెరువు, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండల నూతన తహ సీల్దార్‌గా టీఆర్ జమానుల్లాఖాన్ సోమవారం బాధ్యతలు స్వీకరిం చారు. ఆయన రామగిరి తహసీల్దార్‌గా పనిచేస్తూ నల్లచెరువుకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ రవికుమార్ కదిరి ఆర్డీఓ కార్యాల యం ఏఓగా బదిలీపై వెళ్లారు. నూతన తహసీ ల్దార్‌కు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

ధర్మవరం, జూలై 7(ఆంధ్రజ్యోతి): పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భరోసా కల్పిస్తున్నారని టీడీపీ నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జ్ చింతలపల్లి మహేశ్‌చౌదరి పేర్కొన్నారు. స్థానిక గాంధీనగర్‌లోని టీడీపీ కార్యా లయంలో సోమవారం ముదిగుబ్బ మండలానికి చెందిన తుమ్మల పద్మావతికి పరిటాలశ్రీరామ్ ఆదేశాల మేరకు రూ.58వేల సీఎంఆ ర్ఎఫ్ చెక్కును ఆయన అందజేశారు. టీడీపీ నాయకులు చింత పులుసు పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

రేపు సామాజిక తనిఖీ ప్రజావేదిక

ఓబుళదేవరచెరువు, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలో 2024-25 ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించిన సా మాజిక తనిఖీ ప్రజావేదికను బుధవారం నిర్వహించనున్నట్లు ఏ పీఓ మంజుల తెలిపారు. ఎస్సీ బాలుర హాస్టల్ ఆవరణంలో ఉద యం 11గంటలకు బహిరంగ సమావేశం ఏర్పాటు చేశామన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

నల్లమాడ, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని చారుపల్లి పంచాయతీలో మంగళవారం సుపరిపాలన తొలిఅడుగు కార్యక్ర మానికి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి రానున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ మైలే శివశంకర్ తెలిపారు. ఈకార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

ధర్మవరం, జూలై 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీనగర్‌లో సోమవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వ హించారు. ముఖ్యఅతిథులుగా బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీ శ్‌బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు సాకే ఓబుళేశు హాజరై జెండా ఆవిష్క రించారు. డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళుల ర్పించారు. అనంతరం కేక్‌కట్ చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు బూదెప్ప, సాకే నాగరాజు, నారాయణ, పెద్దన్న, గజ్జల శివప్రసాద్, గజ్జల నరసింహులు, గోపాల్, రామకృష్ణ పాల్గొన్నారు.

పాఠశాలకు కుర్చీల వితరణ


పాఠశాలకు కుర్చీలు అందజేస్తున్న దాతలు

కదిరి అర్బన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళసము ద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సోమవారం టీడీపీ మండల కన్వీనర్ పోగునూరు చెన్నకేశవులు 14 కుర్చీలను విత రణ చేశారు. రూ. పది వేలు విలువ చేసే కుర్చీలను పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు సుబహానుల్లాకు అందించారు. అలాగే అదే పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న క్రిష్ణవేణి ఆరు కుర్చీలు అందజేశారు. దాతలకు ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యా యులు కృతజ్ఞతలు తెలిపారు.

తప్పిపోయిన భార్య, బిడ్డల అప్పగింత

ధర్మవరం, జూలై 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేతిరెడ్డికాలనీకి చెందిన రామకృష్ణకు తప్పిపోయిన ఆయన భార్య ఎర్రమ్మ, ఇద్దరు బిడ్డలను సోమవారం టూటౌన్ సీఐ రెడ్డప్ప అప్పగించారు. ఎర్రమ్మ ఆదివారం భర్తతో గొడవపడి ఇద్దరు బిడ్డలతో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో రామకృష్ణ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో సీఐ రెడ్డప్ప పోలీసులను రంగంలోకి దిం పి గాలింపు చర్యలు చేపట్టారు. ఆమె బళ్లారిలోని ఆశ్రమంలో ఉన్న ట్టు తెలుసుకుని అక్కడికి వెళ్లి ధర్మవరం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌కు పిలుచుకుని వచ్చారు. భర్త రామకృష్ణను పోలీస్‌స్టేషన్‌కు పిలి పించి కౌన్సెలింగ్ ఇచ్చి భార్య, బిడ్డలను సీఐ అప్పగించారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు : సీఐ

ముదిగుబ్బ, జూలై 7(ఆంధ్రజ్యోతి): మైనర్లకు ద్విచక్ర వాహనా లు ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ముదిగుబ్బ అప్‌గ్రేడ్ సీఐ శివరాముడు పేర్కొన్నారు. ఆయన సోమవారం సాయంత్రం సిబ్బందితో కలిసి మండలకేంద్రంలోని రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. రికార్డులు లేని వాహనాలకు రుసుం విధించారు. రహదారిపై ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలిపితే కఠిన చర్య లు తీసు కుంటామని హెచ్చరించారు. ఆటోలలో, ఇతర వాహనాల లో పరిమితికి మించి ప్రయా ణికులను ఎక్కించరాదన్నారు. గూడ్స్ వాహనాలలో క్యాబిన్ పైన కూర్చున్న వారిని కిందికి దింపారు.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

అనంతపురం క్రైం, జూలై 7(ఆంధ్రజ్యోతి): స్థానిక కళ్యాణదుర్గం రోడ్డులో గుర్తు తెలియని బైక్ ఢీకొట్టడంతో ధర్మవరానికి చెందిన ఈశ్వరయ్య(54) మరణించాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈశ్వరయ్య నగరంలోని ఓ వ్యక్తి నుంచి ఆకు కూరలు కొనుగోలు చేసి, వాటిని కాలనీల్లో విక్రయించి జీవనం సాగి స్తుండేవాడు. సోమవారం రాత్రి కళ్యాణదుర్గం బైపాస్‌లో గుర్తుతెలి యని బైక్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఢీకొన్న వాహ నదారుడి వివరాలు తెలియాల్సి ఉంది. ట్రాఫిక్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడిని గుర్తించే పనిలో ఉన్నారు.

రైతులకు కందుల మినీకిట్ల పంపిణీ

కొత్తచెరువు, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులకు జాతీయ ఆహార భద్రత మిషన్ కింద సబ్సిడీపై కందుల మినీ కిట్లను సోమవారం పంపిణీ చేశారు. మండలకేంద్రంలోని రైతుసేవా కేంద్రం వద్ద ఏఓ సతీష్ బాబు ఆధ్వర్యంలో అధికార పార్టీ నాయకుల చేతుల మీదుగా రైతులకు అందజేశారు. మండ లానికి ఎన్‌ఆర్‌జీ -52 రకం 14.80 క్వింటాళ్లు, ఎన్‌ఆర్‌జీ-105 రకం 13 క్వింటాళ్ల మినీకిట్లను ఏపీ సీడ్స్ సరఫరా చేసిందని తెలిపారు.

టీడీపీ విస్తృతస్థాయి సమావేశం

నల్లచెరువు, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని గీతా మందిరంలో సోమవారం టీడీపీ నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. మండల కన్వీనర్ రాజశేఖర్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశాని మండలంలోని 13 పంచాయతీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ కమిటీల సభ్యులు పాల్గొన్నారు. పలు విషయాలపై చర్చించారు. మాజీ జడ్పీటీసీ అబ్దుల్‌ఖాదర్, తెలుగుయువత అధ్యక్షుడు గుప్త ప్రసాద్, మాజీ ఎంపీపీలు మాబూసాబ్, శివారెడ్డి, మాజీ కన్వీనర్ నాగభూషణ నాయుడు, సింగల్ విండో మాజీ అధ్యక్షుడు అంజనప్ప, సర్పంచ్‌లు నాగరాజు, సూరి, నాయకులు దేవేంద్రగౌడ్, సతీష్‌నాయుడు, రమ ణారెడ్డి, జింకా లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి, జయరామిరెడ్డి, కిరణ్‌కుమార్‌నాయుడు, వేణురాయల్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యశాలకు వెళ్లాలంటే భయం.. భయం..

● శిథిలావస్థలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
● కలగానే మిగిలిపోతున్న నూతన భవన నిర్మాణం



ఓబుళదేవరచెరువులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం


పెచ్చులూడిన పైకప్పు

ఓబుళదేవరచెరువు, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆర్యోకేంద్రం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. వైద్యశాలను 1986లో నిర్మిం చారు. దీని పరిధిలో 14 పంచా యతీలు ఉన్నాయి. రోజూ వంద కుపైగా రోగులు వస్తుంటారు. వైద్యశాలలో ఏగది చూసినా పెచ్చులూడి కడ్డీలు దర్శనమిస్తున్నాయి. గోడలు నెర్రెలు చీలాయి. దీంతో రోగులు, సిబ్బంది భయం భయంగా కాలం నెట్టుతున్నారు. గతంలో వైద్య చికిత్సల నిమిత్తం రోగులు డాక్టర్ గది వద్ద వేచి ఉండగా ఉన్నఫలంగా పెచ్చులూడిపడడంతో రోగులు, సిబ్బంది పరుగులు తీసిన సంఘటన చోటుచేసుకుంది.

కలగానే భవన నిర్మాణం

కొన్నేళ్లుగా ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నూతన భవన నిర్మాణం కలగానే మిగిలిపోతోంది. గత వైసీపీ పాలనలో రూ.2.14కోట్లు నిధులు మంజూరు చేశారు. అయితే అప్పట్లో ఐదారుమార్లు టెండర్లు పిలిచినా, బిల్లులు వస్తా యో, రావో అని ఏ కాంట్రాక్టరూ ముందుకురాలేదు. దీంతో నిధులు వెన క్కు వెళ్లాయి. అప్పటినుంచి నూతన భవన నిర్మాణం మండల ప్రజలకు కలగానే మిగిలిపోతోంది. ఇదిలా ఉండగా ప్రభుత్వ వైద్యశాలలో గతంలో మహిళ డాక్టర్ ఉండేవారు. కానీ కొన్నేళ్లుగా మహిళ డాక్టర్ లేకపోవడంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారు.

సమస్యల తిష్ట

వైద్యశాలలో అనేక సమస్యలు తిష్ట వేశాయి. వైద్యశాల కోసం వేసిన బోరు చెడిపోయింది. దీంతో పంచాయతీ నీటిపైనే సిబ్బంది, రోగులు ఆధారపడాల్సి వస్తోంది. వైద్యశాల సమీపంలో చెరువు ఉండడంతో దోమ లు అధికంగా ఉన్నాయి. దోమల బెడదతో రోగులు, సిబ్బందిని పీడిస్తోంది. ఇక్కడ పలు పరికరాలను ఉపయోగించకపోవడంతో తుప్పుపడుతున్నాయి. ట్రైసైకిళ్లు, స్ట్రెచర్లతోపాటు రోగుల మంచాల పరిస్థితి అలాగే ఉంది. ఇక వర్షాకాలం మొదలైతే సిబ్బందికి కష్టాలు తప్పవు. వైద్యశాల పైకప్పు పెచ్చులూడి కడ్డీలు దర్శనమిస్తున్నాయి. దీంతో వర్షం వస్తే చాలు గదులు కారుతాయి. ప్రస్తుత పాలకులైనా స్పందించి నూతన భవనం నిర్మించి రోగులకు సౌకర్యాలు కల్పించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నూతన భవనం నిర్మించాలి



ప్రభుత్వ ఆస్పత్రి నూతన భవన నిర్మాణం ఆశగానే మిగిలిపోతోంది. గత వైసీపీ ప్రభుత్వం ప్రారంభంలో టెండర్లు పిలిచారు. అందుకు అవస రమయ్యే స్థలాన్ని వైద్యశాల ఆవరణంలో శుభ్రం చేశారు. తరువాత కాంట్రాక్టర్ ముందుకు రాక పోవడంతో నిర్మాణం పనులు చేపట్టలేదు. ప్రస్తుత వైద్యశాల శిథిలావస్థకు చేరింది. రోగులు, సిబ్బంది ఇబ్బందులను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం నూతన భవన నిర్మాణం చేపట్టాలి.

-మందోజీ ఆర్ఫీఖాన్, ఓడీచెరువు

పెచ్చులతో భయం



వైద్యశాలకు వెళ్లాలంటే... పెచ్చులు ఎప్పుడు ఊడి పడతాయో అనే భయం వేస్తోంది. భవనంలో చాల చోట్ల పైకప్పు పెచ్చులూడి కడ్డీలు కనిపిస్తున్నాయి. వర్షాకాలంలో వైద్యశాల గదులు కారుతాయి. అధికారులు, ప్రభుత్వం స్పందించి నూతన భవనం నిర్మించాలి.

- రాజారెడ్డి, నారప్పగారిపల్లి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం



వైద్యశాల స్థితి గురించి గతంలో పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నూతన భవన నిరా ్మణం కోసం గతంలో నిధులు మంజూర య్యాయి. టెండర్లు పిలిచారు. కాంట్రాక్టర్ ముందుకురాలేదు. తిరిగి భవన నిర్మాణం కోసం మరోమారు అధి కారుల దృష్టికి తీసుకెళ్లతాం.

-భానుప్రకాష్‌నాయక్, వైద్యాధికారి

సమస్యల పరిష్కారమే ధ్యేయం

● ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి


పెద్దకమ్మవారిపల్లిలో కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే

పుట్టపర్తి రూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు అర్హులైన ప్రతి ఒ క్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి పేర్కొన్నారు. స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని పెద్దకమ్మవారిపల్లిలో సో మవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ... తమ ప్రభుత్వ పాలనా తీరుపై ప్రజల నుంచి మంచి స్పందన కనిపిస్తోందన్నారు. మంచిప్రభుత్వం చిరకాలం ఉండాలని కోరుకుంటు న్నట్లు ప్రజలు తనకు తెలిపారన్నారు. గ్రామంలో తాగునీటి సమస్య తలె త్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మునిసిపల్ కమిషనర్ క్రాంతి కు మార్‌కు ఎమ్మెల్యే సూచించారు. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం బోరుబావికి పూజలు చేసి బోరు వేయించారు. అంతకు మునుపు గ్రామంలో తొలిఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే, మాజీ మంత్రి వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్య క్రమంలో టీడీపీ ఫ్లోర్ లీడర్ రత్నప్పచౌదరి, మాజీ జడ్పీటీసీ చెన్న కేశ వులు, నాయకులు గంగాధర్‌నాయుడు, ఓబులేసు, మురళి, సురేష్ చౌదరి, కృష్ణప్రసాద్, వెంకటేస్, రామ్మోహన్, ముమ్మనేని వెంకట రాము డు, ఊరువాకిలి సురేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్లలో మరింత అభివృద్ధి

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్


కరపత్రాలు అందజేస్తున్న పరిటాల శ్రీరామ్

ధర్మవరం రూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి): తొలిఏడాదిలో ప్రజలు చూస్తున్న అభివృద్ధి కొంతేనని రానున్న నాలుగేళ్లలో మరింత చూస్తారని టీడీపీ నియోజకవర్గ ఇన్ చార్జ్ పరిటాలశ్రీరామ్ అన్నారు. మండలంలోని చిగిచెర్ల గ్రామంలో సోమవారం సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్ర మాన్ని నియోజకవర్గ పరిశీలకులు నాగేంద్రతో కలిసి నిర్వహించారు. గ్రా మంలో ఆయనకు ఘన స్వాగతం పలికారు. ప్రతి ఇంటివద్దకు వెళ్లగానే విశేష స్పందన లభించింది. ముఖ్యంగా పిల్లలందరికి తల్లికివందనం పథకం వర్తిం చడంతో తల్లిదండ్రులు వారితో ఆనందం పంచుకున్నారు. అలాగే మండలంలోని చిగిచెర్ల గ్రామానికి చెందిన మాజీ జడ్పీచైర్మన్ ఓబిరెడ్డి కొన్నిరోజుల క్రితం మోకాలు ఆపరేషన్ చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఆయనను పరిటాల శ్రీరామ్ పరామర్శించారు. ఈ కా ర్యక్రమంలో ఏపీసీడ్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, నియోజ కవర్గ క్లస్టర్ ఇన్‌చార్జ్ మహేష్‌చౌదరి, మాజీ ఎంపీపీలు మద్దిలేటి, కుణుతూరు వేణుగోపాల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ మేకలరామాంజినేయులు, కన్వీనర్ పోతుకుంటలక్ష్మన్న, గొట్లూరు శ్రీనివాసులు, విజయసారథి, తలారి వెంకటలక్ష్మి, ఏగినాటి రమణ, పార్థారెడ్డి, రాఘవరెడ్డి, భాస్కర్ చౌదరి, నేలకోట రామ్మోహన్‌రెడ్డి, తుమ్మల నరసింహరెడ్డి, ఏలుకుంట్ల సుధాకర్, గుత్తాసూరి, మోపూరిరామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

డబ్బులిస్తేనే పాస్ పుస్తకం ఇస్తారంట

● ఎంపీ బీకే, ఎమ్మెల్యే కందికుంటకు రైతు ఫిర్యాదు


ఎంపీ, ఎమ్మెల్యేకి ఫిర్యాదు చేస్తున్న రైతు ఖాజీపీర్

గాండ్లపెంట, జూలై 7(ఆంధ్రజ్యోతి): డబ్బులిస్తేనే పట్టాదారు పాస్‌పు స్తకాలు అందిస్తా మంటున్నారని రెవెన్యూ అధికారులపై రైతు ఖాజాపీర్ ఎంపీ బీకే పార్థసారథి, ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. మండలకేంద్రంలో సోమవారం చేపట్టిన సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమానికి హాజరైన ఎంపీ బీకే, ఎమ్మెల్యే కందికుంట కు మండల కూటమి నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు గాండ్ల పెంట మెయిన్‌రోడ్డు నుంచి జీన్లకుంట వీధిలోని ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరించారు. సమస్యలపై ఆరాతీశారు. పలువురు తమకు గ్యాస్ డబ్బులు జమకాలే దని తెలిపారు. తహసీల్దార్ కార్యాలయానికి వెళ్తే డబ్బులిస్తేనే పనులు చేస్తామని అధికారులు చెబుతున్నట్లు ఆరోపించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాబురావు, ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి, ఎంఈఓ క్రిష్టానా యక్, ఏఓ షాదాబ్, ఏపీఎం సూర్యనారాయణ, వివిధశాఖల అధికారులు, నాయకులు పర్వీన్‌బాను, బాహుద్దీన్, టీడీపీ మండలకన్వీనర్ కొండయ్య, ఎంపీపీ సోమశేఖర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి. ఎంపీటీసీ జయరామ క్రిష్టా రెడ్డి, సర్పంచ్‌లు శివప్పనాయుడు, రహంతుల్లా, నాయకులు సిద్ధారెడ్డి, చంద్ర, దాసిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ఆనంద్, అక్రమ్‌బాషా, టోపీసాబ్, ప వన్, రామాంజులరెడ్డి, జనసేన నాయకురాలు సత్యవతి, క్రిష్టానాయక్, క్లస్టర్ ఇన్‌చార్జ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభలకు తరలిరండి

● సీపీఐ నాయకులు ● పట్టణంలో బైకు ర్యాలీ


ధర్మవరం, జూలై 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈ నెల 31, ఆగస్టు 1వ తేదీన నిర్వహించే సీపీఐ జిల్లా మహాసభలకి అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని సోమవారం ఆ పార్టీ నాయకులు బైకు ర్యాలీ నిర్వహించారు. స్థానిక శివానగర్ శివాలయం వద్ద నుంచి తేరు బజారు, అంజుమన్, ఎన్టీఆర్ సర్కిళ్ల మీదుగా కళాజ్యోతి సర్కిల్ గుండా బైకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మునుగు మధు మాట్లాడుతూ... జిల్లా ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై పోరాటాలకు ఈ మహాసభల్లో రూపకల్పన చేస్తామని తెలి పారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి పూలశెట్టి రవికుమార్, సహాయ కార్యదర్శి ఎర్రంశెట్టి రమణ, చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ, జిల్లా గౌరవాధ్యక్షుడు వెంకట స్వామి, నాయకులు చెన్నంపల్లి శ్రీనివాసులు, గోవిందరాజులు, లక్ష్మీనారా యణ, తాజ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయండి: సీఐటీయూ

కదిరి అర్బన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని సీఐటీయూ, రైతు సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 9న చేపట్టే దేశా వ్యాప్త సమ్మెను విజయవం తం చేయాలని నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం పట్టణంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద నుంచి కాలేజీ సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్ మీదుగా ర్యాలీ కొన సాగింది. కార్మికులు, కర్షకులు పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సాంబశివ, జగన్మో హన్, ముస్తాక్‌అలీ, రామమోహన్, బాబ్‌జాన్, ఆంజనేయులు, శివప్రసాద్, బాలక్రిష్ణ, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయాలను కాపాడుదాం

● మాజీ మంత్రి పల్లె


పోటీల్లో పరుగెడుతున్న ఎద్దులు


బహుమతులు అందజేస్తున్న మాజీ మంత్రి

కొత్తచెరువు, జూలై 7(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత కంప్యూటర్ యుగంలో ప్రాచీన సంప్రదాయాలలు కనుమరుగవుతున్నాయని, వాటిని కాపాడు కోవాలని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పేర్కొన్నారు. తొలి ఏకాదశి సందర్భంగా ప్రతి సంవత్సరం సోమవారం మండల కేంద్రంలోని పు ట్టపర్తి రహదారిలో ఎడ్లబండ్ల పరుగు పందెం పోటీలను నిర్వహించా రు. ఈ పోటీల్లో గెలుపొందిన ఎడ్ల బండ్ల రైతులకు బహుమతుల అం దించే కార్యక్రమానికి మాజీ మంత్రి పల్లె హాజరై మాట్లాడారు. ప్రతి ఏటా ఎద్దులబండి పోటీలను నిర్వహిస్తున్న శీనప్ప, ఆయన బృందాన్ని అభినందించారు. అనం తరం ఈ పోటీల్లో బుచ్చయ్య గారిపల్లి రామాంజి మొదటి బహుమతి కింద రూ. 40 వేలు అందకోగా, రెండో బహుమతి రూ. 20 వేలను కట్లుబడి శీనా, లక్ష్మణ్ అందుకు న్నారు. తృతీయబహుమతి రూ 10 వేలను సాయి గోపాల్ గెలుచు కున్నాడు. వారికి మాజీ మంత్రి పల్లె బహుమతులను అందజేశారు. అలాగే నాలుగో బహుమతి గెలుచుకున్న మున్నాకు సాలక్క గారి రమేష్ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు కూలర్‌ను అందజేశారు. ఐదోబహుమతిని తూమాటి శ్రీధర్‌కు టేబుల్ ఫ్యాన్‌ను జనల్‌స్టోర్ నమస్తే హరి అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జలధికి తరలిన పీర్లు


కొత్తపేటలో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

ధర్మవరం పట్టణంలోని కొత్తపేట రైల్వే స్టేషన్ ఎదురుగా కొలు వుదీరిన పీర్లను సోమవారం జలధికి తరలిం చారు. కొలువుదీరిన పీర్లను అలంకరించి, భక్తులు చక్కెర చదివింపులు చేశారు. అగ్ని గుండ ప్రవేశం చేశారు. సాయంత్రం జలధి నిర్వహిం చారు. నిర్వా హకులు బిల్లే శ్రీనివాసులు, చంద్ర, కళ్లు మాబూబాష, హుస్సేన్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలకేం ద్రమైన తాడిమర్రి, నంబులపూలకుంట మండలపరిధిలోని ధని యాన్‌చె రువు, పెడబల్లిల్లో కొలువుదీరిన పీర్లను జలధికి తర లించారు. గాండ్లపెంట మండలంలోని గాండ్లపెంట, కటారుపల్లి, జీన్లకుంట, తూపల్లిల్లో కొలువుదీరిన పీర్లను జలధికి తరలించారు. ఈ సంద ర్భంగా గాండ్లపెంట సమీపంలోకి అన్ని గ్రామాల పీర్లు చేరుకుని సలాం అందుకున్నాయి. ఓబుళదేవరచెరువు మం డలంలోని కొండ కమర్ల గ్రామంలో పీర్ల జలధి నిర్వహించారు.


తాడిమర్రిలో అగ్నిగుండ ప్రవేశం చేస్తున్న పీర్లు


ధనియాన్‌చెరువులో జలధికి తరలి వెళ్తున్న పీర్లు


గాండ్లపెంటలో...


బడన్నపల్లిలో కొలువుదీరిన పీర్లు

● ధర్మవరం రూరల్: మండలంలోని బడన్నపల్లిలో సోమ వారం రాత్రి పెద్ద సరిగెత్తు నిర్వహిం చారు. పీర్లను గ్రా మంలో ఊరేగించి చావిడిలో కొలువు దీర్చారు. సాయంత్రం గ్రామస్థులు పానకాలు సమర్పించి చక్కెర చదివింపులు చేశారు. గుండం చుట్టూ అలావ్ తొక్కారు.

గిరిజనుల నృత్య ప్రదర్శన


తనకల్లు కళాశాలలో లంబాడీ నృత్యం చేస్తున్న గిరిజనులు

తనకల్లు/నల్లచెరువు, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం లోని శ్రీగోవిందు నరసింహారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, నల్లచెరువు మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం అనంత అటవీ, గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గిరిజన నృత్య ప్రదర్శన ఏర్పాటుచేశారు. ఆంధ్రప్రదేశ్ భాషా, సాం స్కృతిక శాఖ సహకారంతో నిర్వహించినట్లు ఆ సంస్థ అధ్యక్షుడు తోట నరసింహులు తెలిపారు. పురాతన కళలను ప్రభుత్వాలు ప్రోత్సహించి, అభివృద్ధి పరచాలని కోఆర్డినేటర్ శివశంకర్ కోరారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ చెన్నకేశవప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు, సంస్థ తోట నరసింహులు, సరోజమ్మ, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు. నల్ల చెరువులో ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఉపాధ్యాయులు రాజగోపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

తనకల్లు, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని మండ్లిపల్లి వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కదిరికి చెందిన మహ మ్మద్‌అబుజార్, తన్వీర్ గాయపడ్డారు. వారు సోమవారం ద్విచక్ర వాహనంలో కదిరి నుంచి కొక్కంటిక్రాస్‌కు వెళ్తున్నారు. మండ్లిపల్లి సమీపంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడింది. వారికి తీ వ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న వందేమాతరం టీమ్ తమ ఉచిత అంబులెన్స్‌లో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

న్యూస్ బాక్స్

కన్నుల పండువగా ఉట్ల పరుష


ఉట్ల పరుషకు హాజరైన ప్రజలు

సోమందేపల్లి, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కదిరేపల్లి లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాల్లో భాగంగా తొలి ఏకాదశి పండగ సందర్భంగా కమిటీవారు ఉట్లపరుషను ఘనంగా నిర్వహించారు. ఉత్సాహవంతులైన యువకులు బురదమట్టిలో దిగి జారుతున్న స్తంభంపైకి ఎక్కి ఉట్టిని కొట్టే దృశ్యాలు ఆకట్టుకున్నాయి. దీన్ని తిలకించడానికి చుట్టుపక్కల గ్రామస్థులు తరలివచ్చారు. అనంతరం స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ రామక్రిష్ణ, శరత్‌చంద్ర పాల్గొన్నారు.

పరిగి: మండలంలోని బాలరెడ్డిపల్లి గ్రామంలో పెన్నానది వడ్డున వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద తొలి ఏకాదశి సందర్భంగా ఉట్లపరుష నిర్వహించారు. సోమవారం పలువురు యువకులు బురదతో ఉన్న స్థంబాన్ని ఎక్కి ఉట్టికొట్టడం పలువురిని ఆకర్షించింది. పెద్దఎత్తున భక్తులు, ప్రజలు హాజరయ్యారు.

పెనుకొండ: తొలి ఏకాదశిని పురస్కరించుకుని చెరువు రోడ్డులోని దర్గా అంజనేయస్వామి ఆలయంవద్ద సోమవారం సాయంత్రం నిర్వహించిన ఉట్లపరుష ఆకట్టుకుంది. ఉదయం అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పూలతో అలంకరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాద వినియోగం గావించారు. సాయంత్రం నిర్వహించిన ఉట్లపరుష అమితంగా ఆకట్టుకుంది.

వైభవంగా ముక్కాంజనేయస్వామి జాతర


జ్యోతులు మోసుకెళ్తున్న మహిళలు

రొద్దం, జూలై 7(ఆంధ్రజ్యోతి): కుర్లపల్లి గ్రామంలో ఏకాదశి పండగను పురస్కరించుకుని ముక్కాంజనేయస్వామి జాతర నిర్వహించారు. రొద్దం మండల కుర్లపల్లి గ్రామంలో స్వామివారికి పూజలునిర్వహించి మహిళలు కలశాలతో ఊరేగింపు చేపట్టారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలిరావడంతో జాతరలో సందడి సందడిగా నెలకొంది.

నరసింహస్వామి జాతర


రాంపేట నుంచి పాల కడవలతో తరలివస్తున్న భక్తులు

పావగడ, జూలై 7(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని మీనకుంటపల్లి గ్రామంలో జోడుకంబాల నరసింహస్వామి జాతర కన్నుల పండువగా సాగింది. తొలి ఏకాదశి, ద్వాదశి అయిన సోమవారం వేలాది మంది భక్తులు హాజరయ్యారు. సాయంత్రం 4 నుంచి 6గంటల వరకు స్వామివారి ఆలయం చుట్టూ ఎడ్లబండ్లు, ద్విచక్ర వాహనాలు, కార్లు, మేకలు, గొర్రెలతో ప్రదక్షణ చేయించడం ఆనావాయితీగా వస్తోంది. మూడురోజుల నుంచి పస్తులతో ఉండి ఒక్కొక్క వడ్లగింజను చేతితో వలిచి ప్రసాదంచేసి 16 ఆవుల పాలను సేకరించి అప్పల కడవలతో పూజారి తరలిరావడం ఇక్కడి ప్రత్యేకత ఆలయాన్ని మూడు చుట్లు ప్రదక్షణ చేసిన అనంతరం స్వామివారికి క్షీరాభిషేకం చేస్తారు. మహిళలు జ్యోతులు మోస్తూ తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. తొమ్మిదిగ్రామాల భక్తులు జాతరలో పాల్గొని తమ మొక్కుబడులు తర్చుకున్నారు.

కనుమ వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

పెనుకొండ రూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఏకాదశి పండగను పురస్కరించుకుని గుట్టూరు కొండల్లో వెలసిన కనుమ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం స్వామివారికి ప్రత్యేకంగా అలకరించారు. ఆలయ కమిటీ సభ్యులు శ్రీదేవి, భూదేవి, వేంకటేశ్వరస్వామికి వస్త్రాలు సమర్పించారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం

మడకశిర టౌన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మొహర్రం వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణత్యాగాలు చేసిన వీరుల త్యాగాలకు, ముస్లింల విశ్వాసానికి ప్రతీకగా మొహరం నిలుస్తుందని పట్టణ వాసులు అంటున్నారు. మడకశిర పట్టణంలో మారమ్మ గుడివీధి, తేరుబయలు, గాంధీబజార్ ఈమూడుచోట్ల పీర్లను ఏర్పాటు చేశారు. అనేక మంది పీర్ల వద్ద చక్కెర, శనగపప్పులు, బెల్లం, పూలు, అగరబత్తీలతు తదితరవాటితో చదివింపులు చేయించారు.

కేజీబీవీ తనిఖీ

సోమందేపల్లి, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపిరెడ్డిపల్లిలో ఉన్న కేజీబీవీని సోమవారం ఎంపీడీఓ వెంకటలక్ష్మి తనిఖీ చేశారు. గతవారం విద్యార్థినులు అస్వస్థతకు గురైన సంఘటన విదితమే. ఆమె హాస్టల్‌లో ఉన్న వాటర్‌ట్యాంక్, వంటగది, ఆహార పదార్థాలు పరిసరాలను పరిశీలించారు. వంటకు ఉపయోగించే నీరు బోరునీరుకాకుండా ఫిల్టర్ నీరు ఉపయోగించాలన్నారు. ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలన్నారు. వండిన ఆహారాన్ని ఆమె రుచిచూశారు. ప్రతిరోజూ విద్యార్థులకు నాణ్యమైన ఆహారం వడ్డించడంతో పాటు వారి ఆరోగ్యంపట్ల జాగ్రత్త వహించాలన్నారు. ఎంఈఓ ఆంజనేయులునాయక్, ఈఓఆర్డీ లక్ష్మీనరసమ్మ, ఎస్‌ఓ అనిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోకాళ్లపై నిరసన

హిందూపురం, జూలై 7(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని, జీఓ.నం.77ని రద్దు చేయాలని కోరుతూ పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. బాబావలి, ఉమేష్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించడం పక్కన పెట్టిందన్నారు. అనంతరం అంబేడ్కర్ సర్కిల్‌లో మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. భగత్, నాగేంద్ర సాయిరాం, గణేష్, అనిల్, బాలాజీ, లక్ష్మీపతి పాల్గొన్నారు. అలాగే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. మహ్మద్‌అలీ అబ్బాస్, నరసింహమూర్తి, శేషా, మహేంద్ర, కార్తీక్, ప్రభాకర్ పాల్గొన్నారు.


మోకాళ్లపై నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ నాయకులు

రెండు నదుల నడుమ వెలసిన సంగమేశ్వరుడు!

● 700 ఏళ్లనాటి పురాతన ఆలయం
● కోర్కెలు తీర్చే దేవుడని భక్తుల నమ్మకం


సంగమేశ్వరస్వామి ఆలయం

పరిగి, జూలై 7(ఆంధ్రజ్యోతి): పెన్నా, జయమంగళి నదుల నడుమ ఊటకూరు గ్రామ సమీపంలో లింగం రూపంలో భక్తులకు దర్శనమిస్తున్నాడు సంగమేశ్వరుడు. 700సంవత్సరాల క్రితం భూగర్భం నుంచి వంద అడుగులకుపైగా రాతి లింగం ఉద్భవించి ప్రజలకు దర్శనమివ్వడంతో అప్పటి ప్రజలు ఆలయాన్ని నిర్మించారు. రెండు నదుల సంగమం వద్ద వెలసిన శైవక్షేత్రం కావడంతో సంగమేశ్వరుడిగా వెలుగొందుతోంది. ఆలయానికి వెళ్లిన ప్రజల కోర్కెలు తీర్చే దేవుడిగా విరాజిల్లుతున్నారు. కర్ణాటక రాష్ట్రం మైసూరు వద్ద నుంచి దుర్గా కొండల్లో ఉద్భవించే పెన్నానది కర్ణాటక కొరిటెగెర సమీపంలో ప్రారంభమైన జయమంగళి నది ఈ ఆలయం వద్ద కలుస్తాయి. ఈ ప్రదేశంలోనే కలియుగదైవం వేంకటేశ్వర స్వామి ఆలయం కూడా ఉండటం ప్రత్యేకం. దీనిని హరిహర క్షేత్రంగా ప్రజలు పిలుస్తారు. సంగమేశ్వర ఆలయానికి రెండు జంట వటవృక్షాలు ఆదిశేషుని పడగలా ఉండి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. 18గ్రామాల ప్రజల ఆరాధ్యదైవంగా సంతానం లేని వారికి సంతానం ప్రసాదించే అన్నపూర్ణగా సంగమేశ్వర ఆలయం ప్రసిద్ధిచెందింది. కార్తీక మాసం శివరాత్రి పర్వదినాల్లో విశేష పూజలు నిర్వహిస్తారు. ఇందులో ఉన్న నాగేంద్రుడు ఆలయంలోని లింగేశ్వరునికి ఈశ్వరుని మెడలో పాములా చుట్టేసుకుని ఉండటం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. గ్రామానికి అర కిలోమీటరు దూరంలో ఉన్న ఈ ఆలయానికి భక్తులు నిత్య పూజలు నిర్వహిస్తారు. ఆలయానికి వచ్చే మహిళల కోసం మరుగుదొడ్ల సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నీటి సమస్య అధికంగా ఉంది. కొంతమేర ఆలయధర్మకర్తలు భక్తుల ఇబ్బందులు తెలుసుకుని చిన్న చిన్న సౌకర్యాలు కల్పిస్తుంటారు. ఈ ఆలయాన్ని పర్యాటకంగా గుర్తించి అభివృద్ధికి ప్రభుత్వం కృషిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మౌలిక సదుపాయాలు కల్పించండి
- నవీన్‌కుమార్, పూజారి



ఆలయానికి నిత్యం భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకుంటుంటారు. ఆలయం వద్ద మరుగుదొడ్లు, తాగునీరు లేక మహిళలు,భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంత్రి సవిత స్పందించి ఆలయాభివృద్ధికి కృషి చేయాలి.

కోరిన కోర్కెలు తీర్చే దేవుడు: ఉదయ్, భక్తుడు



నా చిన్నప్పటి నుంచి ఇంటి దేవుడైన సంగమేశ్వర ఆలయానికి తరచూ వస్తుంటాను. ఏ సమస్య వచ్చినా ఆలయంలోనే పూజలు, అర్చనలు జరిపి స్వామివారికి చెప్పుకుంటాం. మా సమస్యలు కూడా పరిష్కారం అవుతుంటాయి.

విద్యార్థినికి ల్యాప్‌టాప్ వితరణ


విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేస్తున్న చిన్నప్పయ్య కుటుంబ సభ్యులు

రొద్దం, జూలై 7(ఆంధ్రజ్యోతి): పెద్దగువ్వలపల్లి గ్రామానికి చెందిన రైతు సూరి కుమార్తె మానస బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. టీడీపీ మాజీ జడ్పీటీసీ చిన్నప్పయ్య రూ.45వేల విలువచేసే ల్యాప్‌టాప్‌ను వితరణగా విద్యార్థినికి అందించారు. సోమవారం పెద్దగువ్వలపల్లి గ్రామంలో చిన్నప్పయ్య ఇంట్లో విద్యార్థికి ల్యాప్‌టాప్‌ను అందజేశారు. పంటలు పండక కుమార్తెను చదివించుకోలేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న రైతు సూరీ కుమార్తెకు ల్యాప్‌టాప్‌ను అందజేయడంతో వారి ఆనందానికి అవధులులేకుండా పోయాయి. వెంకటరాముడు, అంజనేయులు, శ్రీరాములు పాల్గొన్నారు.

పీటీఎంకు ఆహ్వానం

పెనుకొండ, జూలై 7(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 10వ తేదీన నిర్వహించే పేరెంట్స్ మీటింగ్‌కు ప్రముఖులు, దాతలకు ఆహ్వాన పత్రికలను అందజేశారు. సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్ ఆధ్వర్యంలో అధ్యాపకులు, స్థానిక షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ శిల్పతోపాటు కళాశాల అభివృద్ధికి విరాళాలు అందించిన దాతలకు సమావేశానికి రావాలని కోరుతూ ఆహ్వాన పత్రికలు అందజేశారు. అధ్యాపకులు బషీర్‌అహ్మద్, నరసింహమూర్తి, ఉమాశంకర్, శివన్న, మౌలాలి, అల్లాబకష్ పాల్గొన్నారు.

క్షుద్రపూజల కలకలం


క్షుద్రపూజ చేసిన ప్రాంతాన్ని చూపుతున్న శివకుమార్

గోరంట్ల, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడిగేపల్లి పంచాయతీ గొల్లపల్లి సమీపంలో క్షుద్రపూజలు చేసిన సంఘటన గ్రామంలో కలకలం రేపింది. గ్రామానికి చెందిన శివకుమార్ తనకుటుంబంపైనే స్థానిక ప్రజాప్రతినిధి, అనుచరులు ఆదివారం రాత్రి క్షుద్రపూజలు చేశారని ఆరోపించారు. గ్రామ సమీపంలోని చెరువు వద్ద రాతిబండపై ముగ్గువేసి, రంగుదారాలు, నిమ్మకాయలు, పుసుపు, కుంకుమ, జోనికల బంద ఆకులు, మునకాయల ముక్కలతో క్షుద్రపూజ చేశారన్నారు. గ్రామం వద్ద తనకు 2.35 ఎకరాల పొలం ఉందని, సీసీ రోడ్డు ఏర్పాటు విషయంలో తనకు, స్థానిక ప్రజాప్రతినిధికి సీసీరోడ్డు వేయకుండా అడ్డుపడుతున్నారని, తన తండ్రి రామాంజనేయుల పేర్లను నిమ్మకాయపై రాసి, రోడ్డు స్థలంలో పాతిపెట్ట, క్షుద్రపూజలు చేశారని శివకుమార్ ఆరోపించారు. దీనపై ఆ ప్రజాప్రతినిధిని వివరణ కోరగా, క్షుద్రపూజ చేయించారనడంలో వాస్తవం లేదన్నారు. గ్రామాభివృద్ధిని అడ్డుకోవడమేకాకుండా, తనకు అపఖ్యాతి కలిగేలా ప్రవర్తిస్తున్న అతనిపై చట్టపరమైన చర్యలు చేపడతామని తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీనవాండ్లపల్లికి చెందిన ముంతాజ్ అనే మహిళ సోమవారం విషద్రావకం తాగి ఆత్మహత్యకు యత్నించింది. సుబహాన్ భార్య ముంతాజ్ కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తిచెంది చీమలు, బొద్దికంలకు ఉపయోగించే లక్ష్మణరేఖ ద్రావకాన్ని తాగి అస్వస్థకుగురయ్యారు. ఆమెను గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా డాక్టర్ తేజశ్వనీ చికిత్సలు చేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ప్రత్యేక వాహనంలో హిందూపురం తరలించారు.

కందుల మినీ కిట్లు మంజూరు

గోరంట్ల, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలో ఖరీఫ్‌లో పంటలు సాగు చేస్తున్న రైతుల కోసం 80క్వింటాళ్ల కంది విత్తనాలు మినీకిట్లు మంజూరైనట్లు ఏఓ శంకర్‌నాయక్ తెలిపారు. ఎల్‌ఆర్‌జీ 105 రకం 30 క్వింటాళ్లు, ఎల్‌ఆర్‌జి 52 రకం 42క్వింటాళ్లనాలుగు కిలోల ప్యాకెట్లులో సరఫరా చేశారన్నారు. మండలంలోని 17 రైతు సేవా కేంద్రాలకు ఒక్కొక్క కేంద్రానికి రెండువందల కిలోల కందులు కేటాయించామన్నారు. త్వరలో మినీకిట్ల పంపిణీ ప్రారంభిస్తామన్నారు. ఖరీఫ్‌లో వేరుశనగ తీసుకోని రైతులకు కందులు అందచేయాలని నిర్ణయించామన్నారు.

పంట రుణం ఇవ్వలేదని ఆర్డీఓకు ఫిర్యాదు

రొద్దం, జూలై 7(ఆంధ్రజ్యోతి): శేషాపురం గ్రామానికి చెందిన సన్నకారు రైతు శకుంతలమ్మ తన మూడెకరాల పొలానికి పెద్దమంతూరు గ్రామీణబ్యాంక్ మేనేజర్ పంటల రుణం ఇవ్వడం లేదని పెనుకొండ ఆర్డీఓ ఆనంద్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం మండలంలోని శేషాపురం గ్రామానికి చెందిన శకుంతలమ్మ, చెరుకూరు గ్రామ పరిధిలోని సర్వేనంబరు 19-3లో మూడెకరాల పొలానికి మూడు నెలలుగా పంటలబీమా కోసం తిరిగితే చీదరించుకున్నాడని ఆర్డీఓతో వాపోయారు. వేరే బ్యాంక్‌లో వెళ్తే పెద్దమంతూరు బ్యాంక్ పరిధిలో మాత్రమే లోన్లు తీసుకోవాలని చెప్పగా పెద్దమంతూరు గ్రామీణ బ్యాంక్ మేనేజర్ పదే పదే తిరస్కరిస్తున్నాడని ఆర్డీఓ వద్ద వాపోయింది. దీనిపై రొద్దం తహసీల్దార్‌కు రెఫర్ చేయగా బ్యాంక్ మేనేజర్‌తో తహసీల్దార్ ఉదయ్ శంకర్‌రాజు ఫోన్ ద్వారా సంప్రదించి వెంటనే రుణం మంజూరు చేయాలని ఆదేశించారు. రెండు రోజుల్లో మంజూరుకు చర్యలు తీసుకుంటామని మేనేజర్ తహసీల్దార్‌కు తెలిపారు.

టీడీపీ కార్యకర్త మృతి


చంద్రశేఖర్ నాయుడు మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎంపీ బీకే

రొద్దం, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన మాజీ పంచాయతీ కన్వీనర్ చంద్రశేఖర్‌నాయుడు (46) అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న హిందూపురం ఎంపీ బీకే పార్థసారధి నివాళులు అర్పించారు. సోమవారం ఉదయం చంద్రశేఖర్‌నాయుడుకు మూర్ఛవ్యాధి రాగా బంధువులు పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. ఎంపీ పార్థసారథి, నాయకులు మృతుడికి టీడీపీ జెండా కప్పి నివాళి అర్పించారు. పార్టీకోసం ఎంతో కృషిచేశాడని కొనియాడారు. పార్టీ అండగా ఉంటుంది అధైర్యపడవద్దని భార్య, పిల్లలకు హామీ ఇచ్చారు. రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. సుబ్బరత్నమ్మ, నరసింహులు, మాజీ జడ్పీటీసీ చిన్నప్పయ్య, వీరాంజనేయులు, లీలావతి, తులసి, మురళి, న్యాయవాదులు నాగరాజు, అశ్వత్థనారాయణ, చంద్రమౌళి పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ జిల్లా జట్టు ఎంపిక


ఎంపికైన క్రీడాకారులతో ఫుట్‌బాల్ సంఘం ప్రతినిధులు

హిందూపురం, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఫుట్‌బాల్ సబ్‌జూనియర్ బాల బాలికల జిల్లా జట్టును సోమవారం ఎంపిక చేశారు. ఎంజీఎం క్రీడామైదానంలో జరిగిన కార్యక్రమానికి సంఘం జిల్లా అధ్యక్షుడు అనీల్‌కుమార్, ట్రెజరర్ శేఖర్, కార్యదర్శి మహ్మద్ సలీం హాజరయ్యారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు చైతన్య, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ జేఏసీ కమిటీ ఎన్నిక

చిలమత్తూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ మండల జేఏసీని ఉపాధ్యాయులు సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు రవికుమార్ పేర్కొన్నారు. గౌరవాధ్యక్షులుగా అలీముల్లా, అధ్యక్షులుగా రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా సుందర్ రాజు, ట్రెజరర్‌గా శ్రీనివాసులు, ఆడిటర్‌గా గోపాలరెడ్డి, మహిళా అధ్యక్షురాలుగా పద్మావతి, ఉపాధ్యక్షురాలుగా శశికళ కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం సమావేశమై అన్ని పాఠశాలలో మెఘా పీటీఎం కార్యక్రమాన్ని చర్చించడం జరిగిందన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించాలి

మడకశిర టౌన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహించిన బదిలీలు, ప్రమోషన్ పొంది ఇతర పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులకు ఇదే నెలలోనే జీతాలు చెల్లించాలని ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోనంకి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం సమావేశం పట్టణంలో నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షులు ఆదినారాయణ, తిప్పేస్వామి, నవీన్, సత్యనారాయణరెడ్డి, మాలతి పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

లేపాక్షి, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం లేపాక్షిలో ఆ సంఘం నాయకులు వేడుకలు ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ భారతరాజ్యాంగం కల్పించిన ఎస్సీ రిజర్వేషన్‌ను ఒక వర్గంవారే లబ్దిపొంది ఆర్థిక, సామాజిక, రాజకీయాల్లో రాణించాలన్నారు. ఈ నేపథ్యంలో మందకృష్ణ మాదిగ నిరంతరం పోరాటంచేసి అందులో మార్పులు తీసుకొచ్చారన్నారు. అందరికీ సమానంగా న్యాయం జరిగేలా కృషిచేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నారాయణ, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

సోమందేపల్లి : మండల కేంద్రంలోఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ వేడుకలను సోమవారం దండోరా నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ జన్మదినం కూడా ఈరోజే కావడంతో స్థానిక అంబేడ్కర్ కూడలిలో కేక్‌కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. కిష్టప్ప, కదిరప్ప, అంజనేయులు, గంగరాజు, మల్లికార్జున పాల్గొన్నారు.

అమరాపురం: స్థానిక అంబేడ్కర్ స్మృతి వనం వద్ద నాగోవనపల్లి శివకుమార్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం మందకృష్ణ మాదిగ జన్మదినం, ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని కేక్‌కట్‌చేసి వేడుకలు జరుపుకున్నారు. జయకుమార్, నారాయణప్ప, కెంచప్ప, తిప్పయ్య, సురేష్, రామచంద్రప్ప, చన్నప్ప, మంజునాథ్, మూర్తి, నాగరాజు, నరసింహమూర్తి, మల్లేష్, వర్మ పాల్గొన్నారు.

పెనుకొండ: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పెనుకొండలో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌వద్ద రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపూరు సురేష్, జిల్లా అధ్యక్షుడు పలక ఆంజనేయులు ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. రామాంజనేయులు, సుధాకర్, పెద్దన్న, ప్రసాద్, రామక్రిష్ణ, హరీష్, మధుసూదన్ పాల్గొన్నారు.


అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు


కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, గుండుమల తిప్పేస్వామి

రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

అగళి, జూలై 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి అన్నారు. అగళి మండలం వి.బ్యాడిగెర పంచాయతీ కెంకెర, బ్యాడిగెర, వడగుంటనహళ్లి, హెచ్‌డిహళ్లిలోని గాయిత్రి కాలనీ, ఉల్లికెర గాయిత్రి కాలనీ, సుగాలి తండాలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని నిర్వీర్యం చేసిందని అయినా సీఎం ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. కార్యదర్శి శ్రీనివాసమూర్తి, కృష్ణమూర్తి, మండల జెడ్పీటీసీ ఉమేష్, కన్వీనర్ మదుడి తిప్పేస్వామి, మాజీ మండల కన్వీనర్ కుమారస్వామి, క్లస్టర్ ఇంచార్జ్ శివకుమార్, సంఖ్యలో ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక: అమరాపురం: కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొని ప్రజలకు వివరించనున్నట్లు మండల కన్వీనర్ కృష్ణమూర్తి తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.


సంక్షేమ కార్యక్రమాలు వివరిస్తున్న ఎమ్మెల్యే సతీమణి ఉమాదేవి

మడకశిర టౌన్: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తారని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు సతీమణి ఉమాదేవి అన్నారు. సోమవారం పట్టణంలోని 13, 14వ వార్డులలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు వివరిస్తూ, ముందుకు సాగారు. నగరపంచాయతీ ఛైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ, మాజీ ఛైర్‌పర్సన్ రాధమ్మ, కౌన్సిలర్లు మేఘన రమేష్, బలరాం, నాగేంద్ర పాల్గొన్నారు.


బూచర్లలో కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

రొద్దం: సీఎం చంద్రబాబు సుపరిపాలనతోనే ప్రజలు సంతోషంగా ఉన్నారని టీడీపీ నాయకుడు మాధవనాయుడు అన్నారు. సోమవారం రొద్దం మండల బూచర్ల గ్రామంలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం ద్వారా నాయకులు ఇంటింటికీ వెళ్లి అభివృద్ధి కార్యక్రమాలపై వివరించారు. మాజీ జడ్పీటీసీ చిన్నప్పయ్య, టైలర్ ఆంజనేయులు, నరహరి, వైస్ ఎంపీపీ నరసింహులు, పుల్లప్పచౌదరి, మహబూబ్‌బాషా, మంజునాథ్, శంకరప్ప, అశ్వత్థనారాయణ, చంద్రమౌళి పాల్గొన్నారు.


గోరంట్లలో..

గోరంట్ల: పట్టణంలోని ఆంజనేయస్వామి కాలనీలో మాజీ సర్పంచ్ నిమ్మల చంద్రశేఖర్, వార్డు సభ్యులు లక్ష్మీనాగరాజు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ఇంటింటా ప్రచారం చేశారు.

ఇల్లు లేని పేదలు ఉండకూడదు: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంస్ రాజు

మడకశిర టౌన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): ని యోజకవర్గం ఇల్లు లేని పేదవారు ఉండకూడదని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు అన్నారు. సోమావరం సాయంత్రం ఎ మ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తహసీల్దారు, హౌసింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమలతిప్పేస్వామితో కలసి అధికారులతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు ప్రతి సమావేశంలోనూ అందరికీ ఇల్లు మంజూరు చేయాలని భవిష్యత్తులో ఏ ఒక్క పేదవాడు ఇల్లు లేదు అన్న మాట వినిపించకూడదన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా అనేక గ్రామాల్లో శ్మశాన వాటిక సమస్య ఉందని ప్రభుత్వ భూమి ఉన్న చోట భూమిని కేటాయించాలని లేని గ్రామాల్లో ప్రత్యామ్నాయం ఆలోచించాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, తహసీల్దార్లు హసీనా సూల్తానా, లక్ష్మీనారాయణ, శ్రీధర్, షేక్షావలి పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

హిందూపురం, జూలై 7(ఆంధ్రజ్యోతి): కేంద్ర కార్మిక సంఘాల పిలుపుమేరకు 9వ తేదీన తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని తూముకుంట పారిశ్రామికవాడ కార్మిక సంఘం నాయకులు రవికుమార్, మారుతీరెడ్డి పిలుపునిచ్చారు. తూముకుంట పారిశ్రామిక వాడలో వివిధ పరిశ్రమల వద్దకు వెళ్లి సమ్మె నోటీసును అందించారు. బాబు, నాగరాజు, పవన్, హనుమంతు పాల్గొన్నారు.

రోడ్డుపైనే మురుగునీరు


ఇందిరమ్మ కాలనీలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

అమరాపురం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శిర రోడ్డు ఇందిరమ్మ కాలనీలో పదేళ్లుగా డ్రైనేజీ వ్యవస్థ లేక మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. కాలనీ ప్రజలు అనేకసార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకపోయిందని వాపోతున్నారు. మూడు ప్రభుత్వాలు మారినా ఇందిరమ్మ కాలనీ రూపురేఖలు మాత్రం మారలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో రోడ్లు, డ్రైనేజీలు లేక వర్షం వచ్చినప్పుడు మరింత ఇబ్బందులు పడుతున్నామన్నారు. వర్షాకాలం ప్రారంభమైందని, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి, రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.